




# మనం
## ఖమ్మం
## భద్రాద్రి కొత్తగూడెం-మహబూబాబాద్

శుక్రవారం | 09 | జూన్ | 2023 | పేజీలు : 10


## మిషన్ కాకతీయ ద్వారా
# చెరువులకు పూర్వ వైభవం



- –చెరువులను నీటితో నింపిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- –చెరువులు నిండడంతో పెరిగిన భూగర్భ జలాలు
- –చెరువుల్లో ఉచిత చేపలు వేయడంతో లక్షల మందికి ఉపాధి
- –తెలంగాణలో ప్రజలకు చెరువులే ఆదెరువు
- –సీఎం కెసిఆర్ తోనే అభివృద్ధి సాధ్యం
- –వైరా రిజర్వాయర్ వద్ద చెరువుల పండుగలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**వైరా, జూన్ 08(మనం న్యూస్) :** తెలంగాణలోని వాతావరణం,భౌగోళిక పరిస్థితులు,నీటి వనరుల లభ్యత, సామాజిక స్థితిగతులను బట్టి కొన్ని శతాబ్దాల క్రితం కాకతీయ రాజులు స్థానిక పరిస్థితులను గుర్తించి ఆనాడే గొలుసు కట్టు చెరువుల నిర్మాణం ద్వారా గ్రామాలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడమే కాక సమగ్ర అభివృద్ధికి ఒక కేంద్రంగా గ్రామాలను తయారు చేశారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం స్థానిక నియోజకవర్గ కేంద్రంలోని వైరా రిజర్వాయర్ వద్ద స్థానిక ఎమ్మెల్యే రాములు నాయక్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెరువుల పండుగలో ముఖ్య అతిథిగా మంత్రి పువ్వాడ పాల్గొన్నారు. చెరువు కట్ట వద్ద కట్టమైసమ్మలకు, అనంతరం గంగమ్మ తల్లికి పూజలు చేశారు. మహిళలు బతుకమ్మలను చెరువుల్లో వదిలారు. రాజుల కాలంలో తెలంగాణలో చెరువులను నిర్మించి కాలువలు ఏర్పాటు 2లో..



**చెరువులను నింపిన ఘనత కేసీఆర్ దే..**

**రూ.50 లక్షల అభివృద్ధి పనులకు రేగా శంకుస్థాపన..**

వివరాలు 10లో..

### ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం
# మత్స్యరంగానికి వెన్నుముక

- ఎంఎల్ఎ వనమా వెంకటేశ్వరరావు
- ఈ ఏడాదిలోనే 743 పైగా చెరువుల్లో నూరు శాతం సబ్సిడిపై కోటి 77 లక్షల చేప పిల్లలు
- –10 చెరువులలో 51 లక్షల విలువైన 21 లక్షల రొయ్య పిల్లలు



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 8 (మనం ప్రతినిధి) :** ఉచిత చేప పిల్లల పంపిణీ పథకంతో మత్స్యరంగానికి వెన్నుముకగా నిలుస్తున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరావు తెలిపారు. గురువారం కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం క్రీడా మైదానంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కు జిల్లా కలెక్టర్ అనుదీప్ తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉచిత చేప పిల్లల పంపిణి పథకం ఆదర్శంగా నిలిచినట్లు చెప్పారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులు పూడికతీత ఫలితంగా చెరువుల్లో నీటిసామర్థ్యం పెరగడం, తదితర కార్యక్రమాల పర్యవసానంగా జలవనరుల సామర్థ్యంతో చేపలు పెంపకానికి అనువుగా ఉన్నట్లు చెప్పారు. నిరాదరణకు గురైన మత్స్య సంపద అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఫలితంగా మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగులు నింపామని చెప్పారు . చెరువుల్లో కొర్రమేనుతో వివిధ రకాల చేపలు , రొయ్యలు పెంపకానికి చర్యలు చేపట్టామని 2లో..

## తహశీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహశీల్దార్
- – 24 కుంటలకు రూ.5వేలు డిమాండ్



**ఏన్కూరు, జూన్ 8(మనం న్యూస్):** ఏన్కూరు తహసిల్దార్ కార్యాలయంలో రూ.3వేలు లంచం తీసుకుంటూ తహసిల్దార్ మహమ్మద్ షా ఖాసీం గురువారం పట్టుబడ్డారు. పక్క సమాచారంతో ఖమ్మం అవినీతి నిరోధక శాఖ డిసీపీ డి.సూర్యనారాయణ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని భద్రుతండా గ్రామానికి చెందిన రైతు బానోతు రామకృష్ణ అనే రైతు సర్వే నెంబర్ 130లో తన తల్లి భోజ్యా పేరు మీద ఉన్న 24 కుంటల భూమిని పట్టా చేయించేందుకు ఎమ్మార్వో ఖాసింను సంప్రదించాడు. అందుకు ఎమ్మార్వో రూ.5వేలు డిమాండ్ చేయగా రూ.3వేలకు ఒప్పందం చేసుకున్నారు. దీంతో రామకృష్ణ ఖమ్మం అవినీతి నిరోధక శాఖ అధికారులను సమాచారం అందించాడు. గురువారం పక్క ప్రణాళికతో ముందుగా చేరుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు ఎమ్మార్వో ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఖమ్మంలోని తహసిల్దార్ ఇంటి వద్ద కూడా సోదాలు చేస్తున్నట్లు ఏసీబీ డిసీపీ తెలిపారు.

**లంచాలకు అడ్డగా మారిన తహసిల్దార్ కార్యాలయం**

లంచాలకు అడ్డాగా తహశీల్దార్ కార్యాలయం మారింది. కుల, ఆదాయ 2లో..

# అశాస్త్రీయమైన చేప ప్రసాదాన్ని నిషేదించాలి

## – రౌండ్ టేబుల్ సమావేశం లో ఊపిరి తిత్తుల నిపుణులు



**ఖమ్మం, జూన్ 8(మనం న్యూస్):** ప్రతి సంవత్సరం ఆస్తమా(ఉబ్బసం) రోగులకు అందించే చేప ప్రసాదంలో ఎటువంటి వ్యాధి నివారణ లక్షణాలు లేవని ఇది కేవలం సైకలాజికల్ బూస్ట్ ఎఫెక్ట్ మాత్రమే అని దీనివలన వ్యాధి లక్షణాలు ఏమాత్రం తగ్గకపోగా ఇతర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది కావున వెంటనే చేప ప్రసాదాన్ని నిలిపివేయాలని అంబేడ్కర్ కళాశాల నందు విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటచేసిన ప్రముఖ చెస్ట్ స్పెషలిస్ట్ వైద్యులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వివరించారు, గతంలో హై కోర్ట్ తీర్పు మేరకు చేప మందును నిలిపి వేయటం జరిగినది, మరల ఇలాంటి అశాస్త్రీయమైన చేప మందుకు ప్రభుత్వం మద్దతు ఇవ్వటానికి ఖండిస్తూ దీనిని వెంటనే నిలిపివేయాలని డాక్టర్లు రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్ చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో డాక్టర్.ఎస్.వెంకటేశ్వర్లు, డాక్టర్.కొప్పు.ధన మూర్తి.డాక్టర్. సురేందర్,డాక్టర్ రవీంద్రనాథ్,.డాక్టర్.ఇ.భారవి,డాక్టర్.కిషోర్ బాబు మొదలైన ఊపిరి తిత్తుల వ్యాధుల నిపుణులు చేప మందులో ఎలాంటి ఔషద గుణాలు లేవని కావున దీనిని నిలిపి వేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు. టీ.శివన్నారాయణ.కే.రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాములమ్మ, రాష్ట్ర కార్యదర్శి ఆలవాల నాగేశ్వర రావు, తాతా రాఘవయ్య,మోహన్,శ్రీ రాములు, ఎస్.వీఆర్.పురుషోత్తం, వీర నారాయణ,ఎసోబు, సీతారామారావు, లక్ష్మీ నారాయణ,పి.సుబ్బారావు ఝాన్సీ, స్వామి పాల్గొన్నారు.

# రైతుల ధాన్యం బిల్లులను తక్షణమే చెల్లించాలి

## తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్

**నేలకొండపల్లి, జూన్ 8(మనం న్యూస్) :** యాసంగిలో రైతులు సాగుచేసిన ధాన్యం బిల్లులను తక్షణమే చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రావెళ్ల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కాంటాలు వేసి నెలలు గడుస్తున్న నేటికీ బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పంటలు పండించే సమయంలో ఒకవైపు కల్తీ విత్తనాలు ఎరువులతో తీవ్రంగా నష్టపోతుండగా, మరోవైపు పండించిన పంటలు చేతికందే సమయంలో అకాల వర్షాలు పేరుతో తీవ్ర నష్టం వాటిల్లి రైతులను కంటిమీద కునుకు లేకుండా చేశాయన్నారు. ఈ నేపథ్యంలో చేతికందిన కొద్దిపాటి పంటలను అమ్ముకొని నెలలు గడుస్తున్న బిల్లుల విషయంలో సంబంధిత నిర్వాహకులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఖరీఫ్ సీజన్ తరుముకొస్తున్న తరుణంలో దుక్కులు దున్నేందుకు, విత్తనాలు కొనేందుకు, కూలీల ఖర్చులకోసం చేతిలో చిల్లి గవ్వలేక రైతుల తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు బిల్లులను సకాలంలో చెల్లించలేని ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో సంబరాలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. సమస్యల నుండి రైతుల దృష్టిని మరల్చడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంబరాల కంటే రైతుల సమస్యల పరిష్కారం మీద దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఇంటూరి అశోక్, రచ్చ నరసింహారావు, సిరికొండ నాగేశ్వరరావు, రాసాల కనకయ్య, బలుసు హనుమంతరావు, ఏరదేశి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చెరువు సంబరాలు





**నేలకొండపల్లి, జూన్ 8(మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని భైరవుని పల్లి, రాజేశ్వరపురం నేలకొండపల్లి అనాసాగరం ముజ్జుగూడెం తదితర గ్రామాలలో ఏర్పాటుచేసిన చెరువు సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి బోనమెత్తి బతుకమ్మలాడుతూ అందరి దృష్టిని ఆకర్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించిన తొమ్మిది ఏళ్ల కాలంలో మునుపెన్నడూ లేని అభివృద్ధిని సాధించి దేశంలోనే అగ్రగామిగా రాష్ట్రాన్ని తీర్చి దిద్దిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్ కు దక్కిందన్నారు. ఆయన సారథ్యంలో రానున్న కాలంలో ప్రజా సంక్షేమం అభివృద్ధిలో మరింత ముందుకు సాగుతుందన్నారు.

నేలకొండపల్లి చెరువు సంబరాలలో బోనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బతుకమ్మలాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ శాఖమూరి సతీష్, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య నేలకొండపల్లి సర్పంచ్ రాయపూడి నవీన్, ఎంపీటీసీ బొడ్డు బొందయ్య, మైస శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ కాకతీయ ద్వారా

(మొదటి పేజీ తరువాయి)

చేయడం ద్వారా సాగునీటి, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించారని, అయితే వాటిని ఉమ్మడి పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేసి, నిర్వీర్యం చేశారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత, సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఆనాటి చెరువులను తిరిగి పునరుద్ధరించడం ద్వారా పూర్వవైభవం తెచ్చారని మంత్రి పేర్కొన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన చెరువులన్నింటిని సీఎం కెసిఆర్ మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరించి పూర్వవైభవం తెచ్చారని చెప్పారు. ఐదువేల కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోని 46 వేల చెరువులను బాగు చేశారని దీనివల్ల భూగర్భ జలాలు పెరిగాయని మంత్రి తెలిపారు. అదే రీతిలో చెరువుల కింద 150 శాతం పంటల సాగుబడి పెరిగిందని అలాగే దిగుబడి కూడా పెరిగిందని మంత్రి వివరించారు. రైతులకు ఎదురు పెట్టుబడి ఇస్తూ అన్ని రకాల వ్యవసాయ రంగ అవసరాలు తీరుస్తూ, 24 గంటల కరెంటు ఉచితంగా అందిస్తూ, చివరకు పంటలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ రైతాంగాన్ని పూర్తిగా ఆదుకొని రైతులు రాజుగా చూసే ప్రజల్ని సౌభాగ్యంగా తీర్చిదిద్దే కార్యక్రమాల్లో సీఎం కేసీఆర్ దిగ్విజయం సాధించారని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను వేయడంతో లక్షల మందికి ఉపాధి లభిస్తున్నదని, నేడు ప్రజలకు ఆరోగ్యకరమైన చేపల దొరుకుతున్నయని అన్నారు. తెలంగాణలో ప్రజలకు చెరువులే ఆదెరువు అని, ఈ విషయాన్ని గుర్తించి, మన స్థానిక అవసరాలకు తగ్గట్టుగా అనేక పథకాలు రూపొందించి, సబ్బండ వర్గాల సమగ్ర అభివృద్ధి కోసం సీఎం కెసిఆర్ గారు నిరంతరం శ్రమిస్తున్నారు, ఆయనకు అండగా ఉందాంమని, ఆయన మనకు అండదండగా ఉంటారని మంత్రి పువ్వాడ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.70 ఏళ్లు దేశాన్ని, రాష్ట్రాన్ని పరిపాలించిన గత పాలకులు నిజాయితీగా పరిపాలన చేసి ఉంటే, ఇవ్వాళ ఇలాంటి దుస్థితి వచ్చేది కాదని, సీఎం కెసిఆర్ ఇంతగా కష్టపడాల్సిన పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గౌతం,అడిషనల్ కలెక్టర్ స్నేహాలత,స్థానిక నియోజకవర్గ అధికారులు నాయకులు పాల్గొన్నారు.

# ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ను ప్రజలు సందర్శించాలని చెప్పారు . మత్స్య సంపద పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాల వల్ల ఫలితాలు వస్తున్నాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు . జిల్లాలోని వివిధ సంఘాల నుండి చెరువులు ద్వారా వివిధ రకాలైన చేపలతో ఎంతో రుచికరమైన ఆహారాన్ని తయారు చేశారని అభినందించారు. ప్రజలు ఫుడ్ ఫెస్టివల్ను సందర్శించి చేపల యొక్క వంటకాలను రుచి చూడాలని చెప్పారు. చేపలు వినియోగం వల్ల మంచి ప్రోటీన్లు వస్తాయని ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు. భద్రాద్రి జిల్లాలో ఈ ఒక్క సంవత్సరంలోనే 743 పై చిలుకు చెరువుల్లో నూరు శాతం సబ్సిడిపై కోటి 77 లక్షల చేప పిల్లలు వేసినట్లు చెప్పారు. 50 కి పైగా ఉన్ననటువంటి సొసైటిల్లో 3 వేల పైగా ఉన్నటువంటి మత్స్యకారులు, సొసైటీలో లేని జీవనం సాగిస్తున్న మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి కల్పించినట్లు చెప్పారు. సమీకృత మత్స్య అభివృద్ధి పథకం క్రింద 10 చెరువులకు గాను 51 లక్షల విలువైన 21 లక్షల రొయ్య పిల్లలు వేసినట్లు చెప్పారు. మత్స్య సంపద పెరగడం వల్ల మత్స్యకారుల కుటుంబాల జీవనోపాధి పెరిగినట్లు చెప్పారు. అనంతరం చేపలతో చేసిన వివిధ రకాల ఆహారాలను తిని చాలా టేస్టీగా ఉన్నాయంటూ అభినందించారు. తదుపరి మత్స్యశాఖ సిబ్బంది శాసనసభ్యులకు, జిల్లా కలెక్టర్కు వలలను బహుమతిగా అందచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పి వైస్ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్రావు , గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ దిండిగాల రాజేందర్ , చుంచుపల్లి ఎంపిపి బదావత్ శాంతి, జిల్లా మత్స్యశాఖ అధికారి వీరన్న , తహసిల్దార్ క్రిష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయంలో

(మొదటి పేజీ తరువాయి)

ధ్రువీకరణ పత్రాల నుండి పహానీలు, భూ పత్రాల మార్పిడి వరకు నిరంతరం రద్దీగా ఉండే తహసీల్దార్ కార్యాలయంలో ఏదో ఒక కొర్రీలు పెట్టి బహిర్గతంగానే లంచాలు అడగడం పరిపాటిగా మారిందని, అడ్డు అదుపు లేకుండా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనుండైనా తహసిల్దార్ కార్యాలయంలో జిల్లా అధికారులు, ఏసీబీ అధికారులు నిరంతరాయంగా తనిఖీలు నిర్వహిస్తూ లంచాలను కట్టడి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# వైభవంగా అనాసాగరంలో చెరువుల పండగ

**నేలకొండపల్లి, జూన్ 8(మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా చేపట్టిన ఊరూర చెరువుల పండగ కార్యక్రమం అనాసాగరంలో వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పాపినేని కరుణశ్రీ ఆధ్వర్యంలో మహిళలంతా బోనం ఎత్తి ,డప్పు డీజే నృత్యాలతో చెరువు వద్దకు చేరుకొని కట్టమైసమ్మకు పూజలు నిర్వహించారు .అనంతరం చెరువు కట్ట దగ్గర మహిళలందరూ కలిసి బతుకమ్మ ఆడుతూ పాడుతూ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కరుణశ్రీ మాట్లాడుతూ చెరువులన్నింటినీ పునరుద్ధరణ చేయడం వల్ల ఎండాకాలంలో నీళ్లతో కళకళలాడుతున్నాయని వారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామపంచాయతీ సెక్రటరీ సత్యనారాయణ . ఎంపిటిసి మేళ్లచెరువు అరుణ. గ్రామ ఉపసర్పంచ్ రామకృష్ణ. ఐకెపి ఎపిఎం అశోక్ రాణి. ఐకెపి అకౌంటెంట్ జయమ్మ. గ్రామ దీపికలు రూప. ప్రమీల. వివో అధ్యక్షురాలు సుజాత. అరుణ .నారాయణమ్మ. చిన్నమ్మాయి. అనాసారం టిఆర్ఎస్ గ్రామ సెక్రెటరీ తుమ్మలపల్లి వెంకటనారాయణ. పాపినేని వెంకటనారాయణ. మేల్లచెరువు నాగేశ్వరరావు. జోగుపర్తి వెంకయ్య. కర్రీ నరసయ్య గ్రామపంచాయతీ సిబ్బంది మరియు పాలకవర్గం పాల్గొన్నారు.

# తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆరేం వరలక్ష్మి

- తెలుగుదేశం పార్టీలో 40 సంవత్సరాల ప్రస్థానం
- ఆవిర్భావం నుంచి ఆరేం రామయ్య దంపతులు పార్టీ వెన్నంటే
- తెలంగాణ రాష్ట్రంలో టిడిపి తరపున గెలిచిన ఏకైక ఎంపీపీ
- ఆదివాసి మహిళకు పార్టీలో సముచిత స్థానం





**ఏన్కూరు, జూన్ 8(మనం న్యూస్):** అది ఒక మారుమూల గిరిజన గ్రామం. కనీస సౌకర్యాలు లేని గ్రామం. అటువంటి గ్రామం నుంచి సింగరేణి కాలరీస్ కంపెనీలో ఉన్నతాధికారిగా ఉద్యోగ సేవలు అందించి, ఉద్యోగ విరమణ అనంతరం ఆ గ్రామంతో పాటు మండలంలోని అనేక సమస్యలను అత్యున్నత స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గాలు కనుగొంటూ గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్న నిత్య కృషివలుడు, తెలుగుదేశం పార్టీ వీర విధేయుడు ఆయనే మండల పరిధిలోని ఒంటిగుడిసె గ్రామ నివాసి, ఎంపీపీ వరలక్ష్మి భర్త ఆరేం రామయ్య. తెలుగుదేశం పార్టీలో 40 సంవత్సరాల సేవలను గుర్తించి తన కుటుంబానికి రాష్ట్రస్థాయిలో ప్రధాన కార్యదర్శిగా పార్టీ ఎంపిక చేసింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీలో వారి ప్రస్థానం గురించి'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు మహా పురుషులవుతారు.' ఇది అరేం రామయ్యకు అక్షరాల వర్తిస్తుంది. రామయ్య పుట్టింది కారేపల్లి మండలం మూల పోచారం. కుటుంబం స్థిరపడింది ఏన్కూరు మండలం. రామయ్య ఏన్కూరు, జూలూరుపాడు మండలాల్లో అందరూ బాగా గుర్తిస్తారు. ఈ మండలాలతో ఆయనకు విడదీయరాని బంధం ఉంది. ప్రతి ఒక్కరికి సుపరిచితుడు. ఇక ఆయన రాజకీయ ప్రస్థానం గురించి.. 1982 తెలుగుదేశం పార్టీ ఆవిర్భావించింది. ఎన్టీఆర్ ఆశయాలకు ఆకర్షితుడై పార్టీలో చేరారు. ఆయన రాజకీయ గురువు చేకూరి కాశయ్య. 1987లో మండల వ్యవస్థ ఏర్పడింది. మొట్టమొదటి మండల పరిషత్ ఎన్నికలు వచ్చాయి. ఆ సమయంలో ఆరేం రామయ్య ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగానికి రాజీనామా చేసి మండల పరిషత్ ఎన్నికలలో ఏన్కూరు ఎంపీపీగా పోటీ చేశారు. ఆనాడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు సైతం రామయ్య తరపున ఎన్నికల ప్రచారం చేశారు. కేవలం 27 ఓట్ల తేడాతో రామయ్య ఓటమిపాలయ్యారు. ఏనాటికైనా తెలుగుదేశం పార్టీ తరపున ప్రజాప్రతినిధిగా ఎన్నికై ప్రజా సేవ చేయాలని ఆయన కోరిక. ఆ రోజు నుండి నేటి వరకు తెలుగుదేశం పార్టీని వీడలేదు. పార్టీ అభివృద్ధి కోసం సొంత నిధులు వెచ్చించి పార్టీని ముందుకు నడిపిస్తున్నారు. టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామానికి చెందిన పూనెం వీరభద్రం కుమార్తె వరలక్ష్మిని వివాహం చేసుకున్నారు. వీరభద్రం కుటుంబం కూడా రాజకీయంగా తెలుగుదేశం పార్టీ సభ్యులే కావటం రామయ్యకు కలిసి వచ్చింది. 90వ దశకంలో రామయ్య సింగరేణి కాలరీస్ లో ఉద్యోగంలో చేరారు. ఏ ప్రాంతంలో విధులు నిర్వర్తించిన ఏన్కూరు, జూలూరుపాడు మండలాలతో రాజకీయ సంబంధాలు కొనసాగిస్తూనే ఉన్నారు. దానితో పాటు పాఠశాలల్లో ఎన్నో దాతృత్వ కార్యక్రమాలు సైతం చేస్తూ వచ్చారు. పాఠశాలలో మొక్కల రక్షణకు ట్రీగారడ్స్ ఏర్పాటు, పదవ తరగతి చదువుతున్న పిల్లలకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయించేవారు. అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చేవారు. ఉద్యోగ బాధ్యతల వల్ల సమన్వయం కుదరక రాజకీయాల్లో తన సతీమణిని ప్రోత్సహించేవారు. ఆమె స్వతహాగా రాజకీయ కుటుంబం నుంచి రావటం వల్ల ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేవారు. ఈ విధంగా వరలక్ష్మి ప్రజలలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి 2014లో జరిగిన మండల పరిషత్ ఎన్నికలలో నాచారం ఎంపీటీసీగా గెలుపొందారు. ఆనాడు తెలుగుదేశం పార్టీకి మెజారిటీ స్థానాలు వచ్చాయి. ఎంపీపీ కావాల్సిన వరలక్ష్మికి తృటిలో అవకాశం చేజారిపోయింది. నిరుత్సాహపడకుండా ప్రజల్లో ఉంటూ మండల రాజకీయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించారు. రామయ్య సైతం ఉద్యోగ విరమణ పొంది సొంత మండలానికి చేరుకున్నారు. 2019లో మండల పరిషత్ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర సమితి దూకుడుకు ఏ పార్టీ కూడా నిలబడ లేకుండా పోయింది. రాష్ట్రం మొత్తం మీద టిఆర్ఎస్ ప్రభంజనాన్ని సైతం ఎదుర్కొని ఏన్కూరు ఎంపీపీగా తెలుగుదేశం పార్టీ గెలిచి నిలబడింది. ఇదంతా ఆరేం రామయ్య రాజకీయ వ్యూహ ప్రతివ్యూహాలతో సాధ్యమైంది. అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలకు గురి చేసిన ఆదివాసి బిడ్డలైన రామయ్య దంపతులు నీతి, నిబద్ధతతో పార్టీ పక్షాన నిలిచారు. దీంతో రాష్ట్రస్థాయిలో తెలుగుదేశం పార్టీలో రామయ్య దంపతులకు తిరుగులేని గుర్తింపు వచ్చింది. స్వయాన పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రామయ్య దంపతులను ఆహ్వానించి, అభినందించారు. చంద్రబాబు నాయుడు దృష్టిలో ప్రత్యేక స్థానం సంపాదించారు. డిసెంబర్ నెలలో ఖమ్మంలో జరిగిన సభ విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం పెల్లు బికింది. దీంతో పార్టీని ప్రజలకు చేరువ చేసే కార్యక్రమాల్లో భాగంగా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. దానిలో భాగంగా ఆరేం వరలక్ష్మిని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. తెలుగుదేశం పార్టీ తరుపున వైరా శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనే వారి ఆశకు ఊతం లభించినట్లయింది. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు చేరువవుతున్న ఆరేం రామయ్య దంపతులకు నియోజకవర్గ ఎమ్మెల్యేగా సేవ చేసే భాగ్యం కలగాలని వారిని అభిమానించే ప్రజలు కోరుకుంటున్నారు.

# చెలరేగుతున్న మట్టి మాఫియా

## రామన్నపాలెంలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



**ఎర్రుపాలెం ,జూన్ 8( మనం న్యూస్ ):** మట్టి మాఫియా రెచ్చిపోతోంది. అనుమతులు లేకుండా మట్టి తవ్వి విక్రయిస్తూ కొందరు అక్రమార్కులు జేబులు నింపు కుంటున్నారు. రైతుల అవసరాల సాకుతో చెరువులో పెద్దపెద్ద అగాతాలుగా తవ్వేస్తూ మట్టిని తరలించుకు పోతున్నారు. కొంత మంది రాజకీయ నాయకులు మట్టి మాఫియ ఆవతారం ఎత్తి వ్యాపారం చేస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరించడంతో మట్టి మాఫియా ఆగడాలు మితిమీరుతున్నాయి. ఈ తవ్వకాల తంతు వెనుక నాయకుల ఆశీస్సులు ఉండటంతో మట్టి దందా జోరుగా సాగుతోంది. మండల పరిధిలోని రామన్నపాలెం గ్రామం చెరువు నుండి మట్టిని మట్టి మాఫియా తవ్వేస్తుంది. మట్టిని ట్రాక్టర్లల్లో ఖాళీ స్థలాలు, రైతుల పంట పొలాలకు తరలిస్తూ భారీగా మట్టి వ్యాపారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పగలు,రాత్రీ తేడా లేకుండా తవ్వకాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి. అధికారులకు మట్టి మాఫియా నుంచి భారీగా ముడుపులు అందడంతో చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం నుంచి మట్టి మాపియా రామన్నపాలెం గ్రామంలో చెలరేగిపోతూ మట్టి అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మట్టి మాఫియాపై తగిన చర్యలు తీసుకోవాలని, మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎందుకీ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు?

## మిగులు బడ్జెట్ గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చినందుకా... కాంగ్రెస్ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్



**మధిర,జూన్8(మనం న్యూస్):** అధికారులు నాయకులు తప్ప రైతులు, ప్రజల స్పందన లేక దశాబ్ది ఉత్సవాలు వెలవెలబోతున్నాయని, ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకా ఉత్సవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ విమర్శించారు. మధిర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఎందుకు ఈ దశాబ్ది ఉత్సవాలని, రైతులకు రుణమాఫీ చేసినందుకా, రైతులకు ఉచిత ఎరువులు ఇస్తామన్న హామీ నెరవేర్చనందుకా.. ఈ రైతు దినోత్సవ సంబరాలు అని ఆరోపించారు. కొత్త ప్రాజెక్టులు కట్టి రైతులకు 24 గంటలు సాగునీరు, కరెంట్ అందిస్తామని చెప్పి ఒక కొత్త ప్రాజెక్టు కూడా కట్టకుండా కాలం వెళ్లదీస్తున్నారని, ధరణి పేరుతో రైతులను ముప్పు తిప్పలు పెడుతూ వారిని తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని, వారి భూమిపై వారికి హక్కు లేకుండా చేసినందుకా... ఉత్సవాలు అని ప్రశ్నించారు. మిగులు బడ్జెట్ ఉన్నా రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రజలు ఈ అబద్ధపు చేతకాని అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తేనే ప్రజల సమస్యలన్నీ తీరుతాయన్నారు. ఈ సమావేశంలో మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిర్యాల వెంకటరమణ గుప్తా, మధిర మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అద్దంకి రవికుమార్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు దుంప వెంకటేశ్వర్ రెడ్డి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు ₹బాణావత్ వెంకటరమణ నాయక్, మండల ఐఎన్టీయూసీ అధ్యక్షుడు కోరంపల్లి చంటి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు, పారుపల్లి విజయకుమార్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ జహంగీర్ ,పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు బిట్రా ఉద్దండయ్య, పట్టణ కాంగ్రెస్ నాయకులు మాగం ప్రసాద్, ఆదిమూలం శ్రీనివాసరావు, మోదుగు బాబు, రామారావు మొదలగువారు పాల్గొన్నారు.

## ఎంపీలు రవిచంద్ర , పార్థసారథి, ఎమ్మెల్యే సండ్రలకు ఘన స్వాగతం





**సత్తుపల్లి టౌన్, జూన్ 8(మనం న్యూస్) :** సత్తుపల్లి మండలం, నారాయణపురంలో ఘనంగా జరిగిన అభయాంజనేయ, ముత్యాలమ్మ విగ్రహాలు, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీలు పార్థసారథి రెడ్డి, రవిచంద్ర, ఎమ్మెల్యే వెంకటవీరయ్యకు గ్రామస్తులు మేళతాళాలతో అపూర్వ స్వాగతం పలికారు. 20అడుగుల భారీ ఆంజనేయ స్వామి, బొడ్రాయి,హోమ గుండాన్ని సందర్శించి కొబ్బరికాయలు కొట్టారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథులకు వేద పండితులు ఆశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, వారి బంధుమిత్రులతో కళకళలాడింది. ఈ మహోత్సవంలో ఎమ్మెల్యే వెంకటవీరయ్య ధర్మపత్ని మహాలక్ష్మీ తో కలిసి పూజల్లో పాల్గొన్నారు.

## బేతుపల్లి చెరువు ప్రత్యామ్నాయ కాలువకు ఎన్టీఆర్ కాలువగా నామకరణం



**సత్తుపల్లి టౌన్, జూన్ 8 (మనం న్యూస్ ):**తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథి రెడ్డి తో కలిసి సత్తుపల్లి పట్టణ శివారు చెరువు వద్ద కట్టా మైసమ్మ, గంగమ్మ తల్లుల పూజ నిర్వహించారు. బేతుపల్లి చెరువు ప్రత్యామ్నాయ కాలువకు ఎన్టీఆర్ కాలువగా నామకరణం చేస్తూ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇటీవల బెస్ట్ ఇంజనీర్ గా ఎంపికైన శ్రీనివాస్ రెడ్డి ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## మధిరలో మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన



**మధిర, జూన్ 8(మనం న్యూస్):** ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి మధిర మండలంలో గురువారం పర్యటించారు. పర్యటనలో భాగంగా మధిరలోని శ్రీరస్తు కళ్యాణమండపం , మాటూరు గ్రామంలో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, పట్టు వస్త్రాలను కానుకగా అందజేశారు. పలు ప్రైవేట్ కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి



**కారేపల్లి, జూన్8 (మనం న్యూస్) :** కారేపల్లి మండల కేంద్రంలో దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆలయ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య గురువారం వైరా శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్ కు వినతి పత్రం వైరా క్యాంపు కార్యాలయంలో కలిసి అందచేశారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ సుదీర్ఘమైన చరిత్ర కలిగిన కారేపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రహరీ గోడ నిర్మాణం, భక్తుల సౌకర్యార్థం మంచినీరు ఏర్పాటు, ఈ ఆదివారం జరిగే సంతలో విక్రయదారులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగు ప్రతిపాదనలు చేశామన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ సహకారంతో నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అజ్మీర వీరన్న, పప్పుల నిర్మల, మార్కెట్ డైరెక్టర్ వాంకుడొత్ నరేష్, జూపల్లి రాము, పాల్తియా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన ఎంఎల్ఏ మెచ్చా నాగేశ్వరరావు కృషి

## ఎస్‌సి హాస్టల్ భవనం కోర్టుకు కేటాయింపు మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరు



**దమ్మపేట, జూన్ 8 (మనం న్యూస్) :** అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కృషి ఫలించింది. జిల్లా విభజన తర్వాత కోర్టు సేవల కోసం సుదూర ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుండడంతో దమ్మపేటలో కోర్టును మంజూరు చేయాలని ఎంఎల్ఏ సిఎంను కలిసి విన్నవించారు. దీంతో దమ్మపేట మల్లారం రోడ్‌లోని ఎస్‌సి హాస్టల్ భవనాన్ని కోర్టుకు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై అధికారులతో ఎంఎల్ఏ గురువారం సమావేశమై చర్చించారు. కోర్టుకు కావాల్సిన సామాగ్రి..భవనం మార్పులు గురించి చర్చించారు. భవనం మరమ్మతుల కోసం సుమారు 20 లక్షలు నిధులు కావాలని అంచనా వేశారు. దీంతో జెడ్పీ నుంచి 5 లక్షలు మంజూరు చేస్తానని జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు తెలిపారు. మండల ప్రజా పరిషత్ నుంచి 5లక్షలు మంజూరు చేయనున్నట్లు వైస్ ఎంపీపీ దారా మల్లికార్జున్ రావు తెలిపారు. శుక్రవారం మరమ్మతుల పనులు ప్రారంభం కానున్నాయని, అతి తక్కువ రోజుల్లో కోర్టు ఏర్పాటు కాబోతోందని తెలిపారు. ఈ సందర్భంగా కోర్టు ఏర్పాటుకు ప్రత్యేకంగా కృషి చేసిన ఎంఎల్‌ఏను, సహకరించిన స్థానిక జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, సర్పంచ్ లను న్యాయవాదులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, సత్తుపల్లి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రావు,సెక్రెటరీ బోర్రా వెంకట్ రావు,వైస్ ఎంపీపీ దారా మల్లికార్జున్ రావు,సర్పంచ్ ఉయ్యాల చిన్న వెంకటేశ్వర్లు,ఉప సర్పంచ్ దారా యుగంధర్,వార్డ్ మెంబర్ పగడాల రాంబాబు సున్నం చిట్టెమ్మ,దారా జ్యోతి,,రాజిని రాంబాబు,కిన్నెర నాగరాజు,యార్లగడ్డ శ్రీనివాస్ రావు, పోతినేని శ్రీరామ వెంకట్ రావు, దమ్మపేట టౌన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు యార్లగడ్డ బాబు,పానుగంటి చిట్టి బాబు,అబ్దుల్ జిన్నా, పండురి వీరబాబు,సత్యనారాయణ,రవి, ఖుఖ్య రాజు, రామి సెట్టి పుల్లారావు, కంభంపాటి సాయి,పసుమర్తి కృష్ణ రావు,దారా రమేష్,లాయర్ లు రాజేందర్ ప్రసాద్, గొందె మురళి మోహన్,గాంధీ సంధ్య రాని,నలగట్ల విజయ్ కుమార్,మరేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే మత్స్య సంపద వృద్ధి

## స్వగ్రామ కుర్నవల్లి చెరువులో ఈత కొట్టిన రేగా కాంతారావు



**కరకగూడెం, జూన్ 8(మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం సమత్ భట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కుర్నపల్లి లోని తన స్వగ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు చెరువును సందర్శించి అనంతరం సంబరంతో చెరువులో దూకి ఈత కొట్టారు. అదేవిధంగా రైతులందరికీ మృగశిర కార్తె శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .గతంలో ప్రభుత్వం చేపల పెంపకంపై దృష్టి సాధించలేదని బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే మత్స్య సంపద అధికంగా పెరుగుతుంది అన్నారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మత్స్య రంగానికి ఊపిరి పోసిన సీఎం కేసీఆర్ దే అన్నారు. రాష్ట్రంలో మత్యసంపద అభివృద్ధికి అద్భుతాలు లభించాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని రంగాల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు, రాష్ట్రంలో కులవృత్తులను కాపాడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. చెరువులను అభివృద్ధి చేసి చేపలను పెంచే విధంగా అనువైన వాతావరణాన్ని ప్రభుత్వం కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి క్రిష్ణ, ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి క్వార్టర్స్‌ను డబుల్ బెడ్ రూమ్ ఇళ్లుగా మార్చి కార్మికులకు ఇవ్వాలి

### డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె సారయ్య



**ఇల్లందు, జూన్ 08 (మనం న్యూస్) :** ఇల్లందు ఏరియాలో అన్యాక్రాంతం అవుతున్న కంపెనీ క్వార్టర్స్ ను కాపాడాలని ప్రస్తుతం నివసిస్తున్న కార్మికులకు ప్రక్కన వున్న ఇంకో క్వార్టర్ ను కలిపి డబుల్ బెడ్ రూమ్ గా మార్చి కార్మికులకు ఇవ్వాలని ఇల్లందు ఏరియా ఎస్ఓటు జీఎం మల్లారపు మల్లయ్యకి ఏఐటియుసి ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె సారయ్య మాట్లాడుతూ ఇల్లందు ఏరియాలో సుమారు 1500 క్వార్టర్స్ వున్నాయని 645 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, చాలా క్వార్టర్స్ అన్యాక్రాంతం కావడం గాకుండా అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయని తెలిపారు. సింగరేణి వివిధ ఏరియాల్లో మణుగూరు, భూపాలపల్లి, సత్తుపల్లి లాంటి ఏరియాలో కార్మికులకు సౌలభ్యంగా డబుల్ బెడ్ రూమ్ క్వార్టర్స్ నిర్మించారని ఇల్లందు ఏరియాలో మాత్రం లేవని అన్నారు. చాలా ఏండ్ల క్రితం నిర్మించిన క్వార్టర్స్ వలన కార్మికులకు అసౌకర్యంగా వున్నాయని, నివసిస్తున్న క్వార్టర్ ప్రక్కన ఖాళీ గా వున్న క్వార్టర్ ను అనుసంధానం చేసి డబుల్ బెడ్ రూమ్ గా మార్చి కార్మికులకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు బ్రాంచి ఉపాధ్యక్షులు ఎస్వీ రమణ, ఏఐటియుసి డివిజన్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్ పాల్గొన్నారు..



## 11న సిపిఐ ప్రజాగర్జన సభను విజయవంతం చేయండి

**దమ్మపేట, జూన్ 8(మనం న్యూస్) :** ఈ నెల 11న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో తలపెట్టిన సిపిఐ ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని దమ్మపేట మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజా గర్జన నిర్వహిస్తున్నారని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య నాయకురాలు తుపాకుల శాంతి, జాన్ బి, నక్క నాగమణి, రాధిక, నిర్మల, మాణిక్యం తదితర మహిళా సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను నెరవేర్చకుండా దశాబ్ది ఉత్సవాలా

## సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు బుర్ర వెంకన్న




**ఇల్లందు. జూన్ 08 (మనం న్యూస్):** దశాబ్ది ఉత్సవాల పేరుతో ఆర్బాటాలు నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి కెసిఆర్ కు ఉత్సవాలు నిర్వహించే నైతిక అర్హత లేదని సిపిఐ (ఎంఎల్ )ప్రజాపందా జిల్లా నాయకులు బుర్ర వెంకన్న, డివిజన్ నాయకులు ఆవుల కిరణ్, బుర్ర రాఘవులు, ఇస్లావత్ కోటేష్ పేర్కొన్నారు. ఇల్లందు మండలం బోయి తండ గ్రామంలో గురువారం సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని నిరుద్యోగాన్ని పెంచిందని ఐదు లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజల నెత్తిన భారం మోపిందని విమర్శించారు. కాంట్రాక్టు వ్యవస్థ ఉండదని చెప్పిన కేసీఆర్ క్రమబద్ధీకరణ చేయడంలో విఫలమయ్యాడని విమర్శించారు. రైతులకు రుణమాఫీ చేయకుండా రైతాంగాన్ని మోసం చేశాడని, పోడు భూములకు పట్టాలిస్తానని చెప్పి కాలయాపన చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతూనే ఉన్నాడని ఆరోపించారు. కేసీఆర్ ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ నెల 12న జిల్లా కేంద్రంలో దీక్ష దివస్ను నిర్వహిస్తున్నామని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం ఎల్ ప్రజా పంథా గ్రామ అజ్మీర పాపన్న. అజ్మీరా సీత. ధరావత్ హరిలాల్.ప్రగతిశీల మహిళా సంఘం( పి ఓ డబ్ల్యు) గ్రామ నాయకురాల భానోతురామి. అజ్మీర సిరి. అజ్మీరా బుల్లి.తదితరులు పాల్గొన్నారు.

# ట్యాంక్ బండ్ పై విద్యుత్ దీపాలు

## లైటింగ్ ను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి



**ఇల్లందు, జూన్ 08 (మనం న్యూస్):** ఇల్లందు పట్టణ ప్రజలకు దాహార్తిని తీర్చే ఇల్లందులపాడు చెరువు కట్టపై నూతన హంగులతో ప్రత్యేకమైన లైటింగ్ తో ట్యాంక్ బండు ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బుధవారం ఇల్లందు శాసనసభ్యులు భానోత్ హరిప్రియ నాయక్ చేతుల మీదుగా ఇల్లందు ట్యాంక్ బండ్ సెంట్రల్ లైటింగ్ ప్రారంభించిన విషయం విధితమే. లైటింగ్ ఏ విధంగా పనిచేస్తుందో పరిశీలించేందుకు సాయంకాలం ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు వెళ్లి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ సాయంకాలం పిల్లలతో సరదాగా గడిపేందుకు ఇల్లందు ట్యాంక్ బండ్ లేక్ పార్క్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వారా రవి, సయ్యద్ ఆజాద్, అంకె పాక నవీన్ కుమార్ , కుమ్మరి రవీందర్ , 20వ వార్డ్ ఇంచార్జ్ ఎర్ర ఈశ్వర్ , మహేష్ , యువజన అధ్యక్షులు మెరుగు కార్తీక్ , సోషల్ మీడియా రాకేష్ , నాయకులు అక్కపల్లి సతీష్ , మాడిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు..

# ప్రజా గర్జన బహిరంగ సభను జయప్రదం చేయండి : సీపీఐ




**భద్రాచలం, జూన్ 8(మనం న్యూస్):** సీపీఐ పట్టణ కార్యవర్గ సమావేశం గురువారం పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి పట్టణ పార్టీ కార్యదర్శి ఆకోజు సునీల్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై, సింగరేణి ,ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ ,పోడు సాగుదారులందరికీ పట్టాలు, లౌకిక వ్యవస్థల పరిరక్షణకై జరుగుతున్న సిపిఐ ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. అలానే భద్రాచలం టెంపుల్ సిటీ అభివృద్ధికి వెయ్యి కోట్ల రూపాయలు ఆర్థిక ప్యాకేజీ మంజూరు చేయాలి. పట్టణానికి అనుకొని ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణ లో కలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్వీఎస్ నాయుడు , మారెడ్డి శివాజీ, శివ ప్రసాద్, నరసింహులు ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి బల్లా సాయికుమార్, మహిళా సంఘం డివిజన్ నాయకురాలు ముప్పా రామలక్ష్మి ఏఐఎస్ఎఫ్ డివిజన్ నాయకులు మారెడ్డి గణేష్, నాగరాజు, తిరుపతిరావు, ఖాదర్, ప్రదీప్ ,నాగరాజు,వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల పండుగతో గ్రామాల్లో పండగ వాతావరణం



**పినపాక,జూన్ 08(మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా లో గురువారం పినపాక మండల వ్యాప్తంగా ఊరూరా చెరువుల పండగ నిర్వహించారు. రాష్ట్రం ఏర్పాటు తరువాత చెరువుల పునరుద్దరణ, ఆయకట్టు స్థిరీకరణ ,చెక్ డ్యామ్ ల నిర్మాణంతో పాటు చెరువును ఎప్పుడూ నిండు కుండల ఉండడం రైతాంగానికి ఉపయోగ పడటం వంటి కార్యక్రమాలను ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారులు వివరించారు.అన్ని గ్రామపంచాయతీలలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని పెద్ద చెరువుల వద్ద చెరువు పండుగ నిర్వహించారు..గ్రామం నుంచి డప్పులు, బోనాలు, బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహించారు.గ్రామంలోని రైతులు, మత్స్యకారులు, మహిళలు అన్ని వర్గాల ప్రజలు చెరువు కట్ట వద్దకు చేరుకొని చెరువు గట్టుపై పండగ వాతావరణం ప్రతిబింబించేలా ముగ్గులు, తోరణాలతో అందంగా అలంకరించి చెరువు పండగ నిర్వహించారు. కట్టమైసమ్మ పూజ, చెరువు నీటికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ కోలాటాలు అలరించాయి. ఇరిగేషన్ లో వచ్చిన ప్రగతి తద్వారా పెరిగిన పంటల ఉత్పత్తి వివరాలు, మత్స్య సంపద, జిల్లాల పెరుగుదల తదితర వివరాలను గ్రామ పెద్దలతో పాటు, ప్రజాప్రతినిధులు అధికారులు చెరువు గట్టు కార్యక్రమంలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ,తహసీల్దార్ ప్రసాద్ , ఎంపీడీఓ చంద్రశేఖర్, జడ్పిటిసి సుభద్రా దేవి వాసు బాబు, స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు, స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు హైదరాబాద్‌లో శిక్షణ



**భద్రాచలం, జూన్ 8(మనం న్యూస్) :** 2024 సంవత్సరమునకు గాను, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ పరీక్షలు కోసం ఎస్టీ, ఎస్సి, బిసి అభ్యర్థులకు హైదరాబాదులోని రాజేంద్రనగర్ లో ఉన్న గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్లో రెసిడెన్షియల్ పద్ధతిలో తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గౌతమ్ పోట్రూ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టినా జెడ్ చంగతు ఆదేశానుసారం ఎస్టీ,ఎస్సి, బీసీ అభ్యర్థులకు ఐఏఎస్ స్టడీ సర్కిల్లో రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ కొరకు అభ్యర్థులను ఆబ్జెక్టివ్ టైప్, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారని, దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం 3 లక్షలకు మించకూడదని, అభ్యర్థులు ఈ నెల 9 నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 62 81 76 65 34 నంబర్లో అన్ని పని దినాలలో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు సంప్రదించాలని కోరారు.

# గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక





**భద్రాచలం, జూన్ 8(మనం న్యూస్):** గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలలో రాష్ట్ర అధ్యక్షునిగా రామా వజ్జల రవికుమార్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పురాణం రామప్ప శాస్త్రి, డాక్టర్ దేవులపల్లి హనుమంతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పాలకుర్తి .వెంకటరమణ కోశాధికారిగా మరింగంటి ,రామాచార్యులు కార్యదర్శిగా బుక్కపట్నం ,రామాచార్యులు సహాయ కార్యదర్శిగా ఆర్. వి శ్రీనివాస్ శర్మ ,ప్రచార కార్యదర్శిగా బి .సత్యప్రసాద్ ఎన్నుకున్నట్లు అధ్యక్షులు తెలిపారు .కార్యవర్గ సభ్యులుగా కాదంబరి. కృష్ణశర్మ సౌమిత్రి. శేషాచార్యులు కంజర్ల .జగన్నా ధాచార్యులు కలకోట. రఘురామాచార్యులు వెలది .శివ సాయి కుమార్ శర్మ ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు కవర్ అయ్యే విధంగా రాష్ట్ర కమిటీని విస్తృత పరచడం జరుగుతుందని నూతన అధ్యక్షులు రవికుమార్ శర్మ తెలియజేశారు. ఇప్పటివరకు కొనసాగుతున్న జిల్లా కమిటీలు, డివిజన్ కమిటీలు ఇకముందు కూడా కొనసాగుతాయని తెలియజేశారు. త్వరలో జిల్లాల వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని నూతన రాష్ట్ర కమిటీ తెలియజేసింది.

# ఎంపీవో గా వెంకటేశ్వరరావు



**పినపాక, జూన్ 08(మనం న్యూస్ ):** పినపాక మండల నూతన మండల పంచాయతీ అధికారిగా గురువారం కంటిపూడి వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. గత కొద్ది కాలంగా ఇన్చార్జ్ ఎంపీవో గా ఈ బయ్యారం సెక్రటరీ జైపాల్ రెడ్డి విధులు నిర్వహించారు. ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించి వెంకటేశ్వరరావు ఎంపీడీవో చంద్రశేఖర్ , పంచాయతీ కార్యదర్శులు, మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు.ఎంపీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ పంచాయతీల్లోని సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. పంచాయతీల్లో సమస్యలుంటే నేరుగా తనకు తెలియజేయాలని కోరారు.

# ఉచిత పుస్తకాలు పంపిణీ



**ఆళ్లపల్లి, జూన్ 8 (మనం న్యూస్):** ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్య పుస్తకాలను ఎం ఈ ఓ పి. కృష్ణయ్య అనంతగు ఏహెచ్ ఎస్ పాఠశాలలో మండలం లోని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని విద్యతోపాటు క్రీడలలో ప్రతిభ కనబరిచేలా ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతవు ఏహెచ్ఎస్ హెచ్ఎం శ్రీనివాసరావు, ఎంపి యూపీఎస్ హెచ్ఎం బాలాజీ, జోగ రాంబాబు సంది బంధం ప్రధానోపాధ్యాయులు బానోత్ బొజ్జ, చంద్రాపురం ఉపాధ్యాయులు అంగోతు రమేష్, నాగు, రేణుక ,రాధా, రామయ్య, సునీత, పాల్గొన్నారు.

# జర్నలిస్టుల కంటి వెలుగు శిబిరం విజయవంతం

### – రెండవ రోజు 105 మంది జర్నలిస్టులకు పరీక్షలు

### – వైద్య ఆరోగ్యశాఖ కు కృతజ్ఞతలు : టియుడబ్ల్యూజే (ఐజేయు), ఖమ్మం ప్రెస్ క్లబ్



**ఖమ్మం, జూన్ 8(మనం న్యూస్)** : టియుడబ్ల్యూజే (ఐజేయు) ఖమ్మం నగర కమిటీ, ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సౌజన్యంతో రెండు రోజులపాటు ఖమ్మం జిల్లా పరిషత్ ప్రాంగణంలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరం విజయవంతమైంది. శిబిరంలో గురువారం రెండవ రోజు 105 మంది జర్నలిస్టులకు కంటి పరీక్షలు నిర్వహించి రీడింగ్, సైట్ కంటి అద్దాలు అందజేశారు. తొలి రోజు శిబిరాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు , ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి . మాలతి, టీయూడబ్ల్యూజే (ఐజేయు) జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే రామనారాయణ ప్రారంభించిన విషయం తెలిసిందే. కంటి వెలుగు శిబిరాన్ని , కంటి పరీక్షలను వారు ప్రారంభించి రీడింగ్, సైట్ కంటి అద్దాలు కొన్నింటిని అప్పటికప్పుడే అందజేశారు. రెండవ రోజు అదే రీతిలో కంటి పరీక్షలు నిర్వహించగా , వైద్యులు అద్దాలు అందజేశారు. జర్నలిస్టు యూనియన్ ఖమ్మం నగర కమిటీ అధ్యక్షులు, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మైస పాపారావు అధ్యక్షతన జరిగిన ఈ రెండు రోజుల కార్యక్రమంలో మొత్తం 199 మంది పరీక్షలు చేయించుకున్నారు. కంటి వెలుగు శిబిరం ముగింపు సందర్భంగా అధ్యక్షులు మైస పాపారావు, నగర కమిటీ కార్యదర్శి, అక్రిడేషన్ కమిటీ మెంబర్ చెరుకుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు, జిల్లా కలెక్టర్ గౌతం కు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు, పాల్గొన్న ప్రజా ప్రతినిధులకు, జర్నలిస్టు యూనియన్ నాయకులకు, జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి. మాలతి , డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ రాంబాబు, కంటి వెలుగు శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ నిత్య, ఆప్తమెట్రిస్ట్ డాక్టర్ లోహిత, పారామెట్రిక్ ఆప్తాలమిక్ ఆఫీసర్ లు డాక్టర్ ప్రవీణ్, వీణ, ఏఎన్ఎంలు లక్ష్మి, పద్మావతి, వైద్య సిబ్బంది, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

# బిసిలు లక్ష ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోండి

### – ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 8 (మనం ప్రతినిధి) :** తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగగతుల చెందిన అన్ని కులవృత్తులు, చేతి వృత్తుల వారికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేసేందుకు వెనుకబడిన తరగగతులకు చెందిన అన్ని కులవృత్తులు, చేతివృత్తులు చేసుకొనేవారు కొత్తగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఎల్ఏ వనమా కోరారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఒక లక్ష ఆర్థిక సహాయం వెనుకబడిన తరగతుల వారు కులవృత్తులు, చేతివృత్తుల అభ్యున్నతికి కుటుంబంలో ఒక్కరికి మాత్రమే మంజూరి చేయబడుతుందని, లబ్దిదారుల వయస్సు 18 పైన 55 సంవత్సరములోపు ఉండాలని, లబ్దిదారుల కుటుంబ వార్షిక ఆదాయము గ్రామీణ ప్రాంతాల వారికి రూ. లక్ష 50 వేలలోపు మరియు పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలలోపు ఉండాలని, లబ్దిదారులు గత 5 సంవత్సరములలో ఏ ప్రభుత్వ శాఖ / సంక్షేమ పథకముల ద్వారానైన లబ్దిపొంది ఉంటే వారు అర్హులు కారని, వెనుకబడిన తరగతులకు చెందిన అన్ని కులవృత్తులు , చేతి వృత్తులు చేసుకొనువారు క్రొత్తగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోడానికి ఈ నెల 06 న వెబ్సైట్ ను మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారని ఎంఎల్ఏ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత దరఖాస్తును సంబంధిత మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు / మున్సిపల్ కమీషనర్ కు సమర్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా కమిటీ ఎంపిక ప్రక్రియను పూర్తిచేస్తుంది . జిల్లా కలెక్టర్ జూన్ 27 నుండి జూలై 04 వరకు జిల్లా ఇంచార్జ్ మినిస్టర్ ఆమోదం తీసుకుంటారని, వెబ్సైట్లోని ఎంపిక జాబిత దశల వారిగా మండలం మరియు గ్రామ పంచాయితీలలో ప్రదర్శించాల్సి ఉంటుందని, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సంక్షేమ దినోత్సవం సందర్భంగా నేడు సిఎం ఈ పథకాన్ని లాంచనంగా ప్రారంభించిన అనంతరం ప్రతినెల 15 వ తేదీలోగా లబ్దిదారులకు గ్రాంటు విడుదల మరియు పంపిణి ఒకేసారి చెల్లింపు చేయబడుతుందని, పరికరాల ఎంపిక మరియు కొనుగోలు స్థలం లబ్దిదారులకు వదిలి వేయబడుతుందని ఎంఎల్ఏ వనమా తెలిపారు. కలెక్టర్ చే నియమించబడిన మండల ప్రత్యేక అధికారి, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి మరియు బృందం నెల వ్యవధిలోగా యూనిట్ స్థిరీకరణ జరిగినదా లేదా చూసి, లబ్దిదారుని ఫోటోని వెబ్సైట్లో అప్లోడ్ చేస్తారని, ప్రత్యేక అధికారి తప్పనిసరిగా ప్రతి మూడు నెలలకు ఒకసారి యూనిట్లకు పర్యవేక్షిస్తారని, లబ్దిదారుని యూనిట్ అభివృద్ధి ఎలా ఉందో రెండు సంవత్సరముల వరకు గమనిస్తారని ఎంఎల్ఏ వనమా తెలిపారు. బిసి సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఏ వనమా కోరారు.

# ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్సీ తాతా మధు

**తిరుమలాయపాలెం, జూన్ 8 (మనం న్యూస్):** ఖమ్మం జిల్లా వైద్యాధికారి మాలతీతో కలిసి తిరుమలాయపాలెం మండలం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సదుపాయాలను ఎంఎల్సి తాతా మధు పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. తన సొంత మండలంలోని తిరుమలాయపాలెం ప్రభుత్వ ఆసుపత్రి లో వైద్య సేవలో అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆసుపత్రి లో ఇంకా కావలసిన సదుపాయాలపై నివేదిక రూపొందించాలని జిల్లా వైద్యాధికారి మాలతీని ఆదేశించారు. అనంతరం పిండిప్రోలులో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి, కంటి పరీక్షల నిమిత్తం అవసరమైన వారికి కళ్ళజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైద్య అధికారులు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.






# యువతపైనే దేశ భవిష్యత్ ఆధారం

### ఎస్బిఐటి యూత్ ఫెస్టివల్లో ఎంపీ నామ

**ఖమ్మం, జూన్ 08(మనం న్యూస్):** దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉందని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు.ఖమ్మం లోని ఎస్బిఐటి కాలేజీ లో నెహ్రూ యువక కేంద్రం భాగస్వామ్యం తో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ నామ పాల్గొని, మాట్లాడారు. యువత సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. పేద విద్యార్థుల కోసం వేయికి పైగానే గురుకులాలు పెట్టిన చరిత్ర సీఎం కేసీఆర్ ప్రభుత్వానిదని అన్నారు. పల్లెటూళ్ల నుంచి వచ్చి ఇక్కడ చదువుకుంటున్నారని, నేను కూడా పల్లెటూరి లోనే పుట్టానని, పేదల కష్టాలు తనకేరుక అన్నారు. విద్యార్థులు, యువకులు సామాజిక సేవల్లో విస్తృతంగా పాల్గొని, సమాజానికి అంకితమై పని చేయాలన్నారు. ఎస్బీఐటీ చైర్మన్ ఆర్జేసీ కృష్ణ మాట్లాడుతూ తెలంగాణా ఉద్యమ సమయంలో ఎంపీ నామ నాగేశ్వరరావు ఉద్యమ స్ఫూర్తి తనకెంతగానో స్ఫూర్తినిచ్చిందన్నారు. పార్లమెంట్ లో బిల్లు ప్రవేశ పెట్టే సందర్భంలో తలువులు నెట్టుకుంటూ ముందుకొచ్చి,తెలంగాణా బిల్లుకు మద్దతు కూడగట్టారని అన్నారు. ఈ సందర్భంగా కాలేజీ యాజమాన్యం ఎంపీ నామను శాలువా తో సన్మానించింది. కార్యక్రమంలో ఎస్బీఐటీ కాలేజీ చైర్మన్ ఆర్జేసీ కృష్ణ, నల్లమల వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రాజ్ కుమార్ , ఎన్వైకే ప్రెసిడెంట్ అన్వేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన



**ఖమ్మం/ కొత్తగూడెం, జూన్ 8(మనం న్యూస్):** ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఉమ్మడి ఖమ్మంజిల్లాలో గురువారం పర్యటించారు. పర్యటనలో భాగంగా మధిర, బోనకల్, వైరా, తల్లాడ, ఏన్కూరు, జూలూరు పాడు, కొత్తగూడెం, రుద్రంపూర్, పాల్వంచ, ఖమ్మం, ఖమ్మం రూరల్ మండలాల్లో పర్యటించారు. పర్యటనలో భాగంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టువస్త్రాలను కానుకగా సమర్పించారు. ఇతర శుభకార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. అదేవిధంగా పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆర్థిక సాయాలను కూడా అందజేశారు. పలు ప్రయివేటు కార్యక్రమాల్లోనూ పొంగులేటి పాల్గొన్నారు. ఈ పర్యటనలో పొంగులేటి వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, ఊకంటి గోపాలరావు, డాక్టర్ కోటా రాంబాబు, విజయబాయి, సుధాకర్, తూము చౌదరి, డాక్టర్ రాజా రమేష్ తదితరులు ఉన్నారు.

# మండలంలో ముమ్మరంగా వైద్య శిబిరాలు....




**కరకగూడెం జూన్ 8 (మనం న్యూస్):** కరకగూడెం మండల వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యాధికారి కారం మధు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహించారు. తాటి గూడెం, రేగళ్ల ,పద్మాపురం, బట్టుపల్లి గ్రామాలలో ఇంటింటి సర్వే వైరల్ ఫీవర్ల మీద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామాలలో వైరల్ ఫీవర్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైద్య సిబ్బంది తక్కువగా ఉండడంతో జిల్లా వైద్యాధికారులు రెండు టీములు మండలానికి పంపించి గ్రామాలలో జ్వర పీడిత గ్రామాలను సర్వే నిర్వహించి జిల్లా టీమ్ కు అందజేస్తామని అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యం ప్రజలకు అందుబాటులో ఉందని 52 రకాల రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ప్రజలు వైద్య శిబిరాలను చేసుకోవాలని ఆయన కోరారు. వైరల్ అవగాహన కలిగి ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రత చుట్టుపక్కల ప్రాంత పరిస్థితిలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేష్, వైద్య సిబ్బంది కృష్ణ, నరసింహారావు , ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను దగా చేసే మద్దతు ధరలు

## పెట్టుబడి కంటే వరికి 1200, పత్తికి 4 వేలు తక్కువ

## మద్దతు ధరల అమలు చట్టం ఎప్పుడు?

## వరికి 5 వేలు, పత్తికి 16 వేలు యివ్వాలి

## -సిపియం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

**ఖమ్మం, జూన్ 8 (మనం న్యూస్) :** నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం వ్యవసాయ పంటలకు ప్రకటించిన మద్దతు ధరలు రైతులను మరొకసారి దగా చేయటమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని నమ్మించిన ప్రధాని మోడీ రైతుల అప్పులను రెట్టింపు చేశాడన్నారు. కనీసం పెట్టుబడి కూడా రాకుండా యిచ్చే మద్దతు ధరలు గురించి గొప్పలు చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. జాతీయ



సగటు పేరుతో దక్షిణాది రాష్ట్రాల రైతుల కష్టాన్ని కేంద్రం దోచుకుంటుందని మండిపడ్డారు. ధర నిర్ణయంలో శాస్త్రీయత లేదన్నారు. క్వింటా వరి ధాన్యం ఉత్పత్తి ఖర్చు 3300 రూ.లు అయితే 1200 రూ.లు తగ్గించి 2183, పత్తికి క్వింటాకు 12 వేలు ఉత్పత్తి ఖర్చు అయితే 4 వేలు తగ్గించి 7020 రూ.లు నిర్ణయించటం రైతులను అప్పుల ఊబిలోకి నెట్టే చర్యలు తప్ప మరొకటి కాదన్నారు. మిగతా పంటల పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందన్నారు. ఈ దిక్కుమాలిన కంటితుడుపు మద్దతు ధరలు గాలికి ప్రకటించటమే తప్ప కనీసం వీటినైనా అమలుపరిచే చట్టమే లేదన్నారు. రైతు ఉద్యమాలకు తలొంచి మద్దతు ధరల చట్టం తెస్తామని చెప్పి 2 సం.లు అయినా దాని ఊసే లేదన్నారు. మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని, కార్పొరేట్ల కోసమే ఇంతగా పనిచేసే ప్రభుత్వం ప్రపంచంలో మరొకటి లేదన్నారు. వరికి 5 వేలు, పత్తికి 16 వేలు అదేస్థాయిలో మిగతా పంటలకు గిట్టుబాటు ధరలు యిచ్చి ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# పేదల 'కంటి వెలుగు' అయిన కేసీఆర్

## – సర్పంచ్ బాణోత్ కుమార్, ఎంపీటీసీ ఉమా శంకర్

**కారేపల్లి రూరల్, జూన్ 8 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర నాలుగు కోట్ల ప్రజల కంటి వెలుగుగా కెసిఆర్ ఉన్నారని తోడిదలగూడెం సర్పంచ్ బానోత్ కుమార్, ఎంపీటీసీ పెద్ద బోయిన ఉమా శంకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని తడుతులగూడెం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూపేద ప్రజల



జీవితాల్లో వెలుగు నింపాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం చేపట్టిందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణలో పథకాలు కొనసాగుతున్నాయన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని జయప్రదం చేయాలన్నారు. ప్రారంభ సందర్భంగా శిబిరానికి వచ్చిన వృద్ధులను ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వ పథకాలు, నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల గురించి అడగక తెలంగాణ రాష్ట్రం రాకపోతే ఈ విధమైన అభివృద్ధి సంక్షేమం దక్కేది కాదని పలువురు ప్రజలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మర్సకట్ల రోశయ్య, గ్రామ కార్యదర్శి ఉమా, ఏఎన్ఎం ధనలక్ష్మి, కంటి వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా జల్లేపల్లి చెరువులో పండగ

**తిరుమలాయపాలెం న్యూస్ , జూన్8 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చేపట్టిన ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమం గురువారం మండల పరిధిలోని జల్లేపల్లి లో వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ భాష బోయిన శైలజ వీరన్న



ఆధ్వర్యంలో మహిళలంతా బోనమెత్తి డప్పు నృత్యాలతో చెరువు వద్దకు చేరుకుని కట్టమైసమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం చెరువు కట్ట వద్ద మహిళలందరూ కలిసి బతుకమ్మ ఆడుతూ పాటలు పాడుతూ ముత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జల్లెపల్లి చెరువు పరిధిలో రెండు సంఘాలు ఉన్నాయని సంఘాలకు 2017–18 సంవత్సరాల నుంచి 2022–23 సంవత్సరాల వరకు 3.80 లక్షల సబ్సిడీపై చేప పిల్లలు, 2.90 లక్షల విలువైన చేప పిల్లలు, సాధించిన ఉత్పత్తి రెండు లక్షల పదహారువేల 827టన్నులు, వీటి ద్వారా 281.87 లక్షల ఆదాయం, 84 ద్విచక్రవాహనాలు ఇచ్చామని ఇదంతా తెలంగాణ ప్రభుత్వం సాధించిన ఘనతగా పేర్కొన్నారు. ఈ క్రమంలో గ్రామ సర్పంచ్ భాష బోయిన శైలజ టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బాసిపోయిన వీరన్న గ్రామ కార్యదర్శి ధనలక్ష్మి అంగన్వాడి టీచర్లు మలుసురమ్మ పద్మ కోట్ల జగదీష్ మట్ట హనుమంతరావు బద్యా నాయక్ అలీ ప్రసాద్ నవీన్ ఉన్న వెంకయ్య అనపర్తి దర్గయ్య దివ్య శ్రీనివాస్ పొన్నం పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు

# వైభవంగా గేటు కారేపల్లి చెరువుల పండగ

**కారేపల్లి రూరల్, జూన్8 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చేపట్టిన ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమం గురువారం మండల పరిధిలోని గేటు కారేపల్లిలో వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ భూక్య కల్పన ఆధ్వర్యంలో మహిళలంతా బోనమెత్తి డప్పు నృత్యాలతో చెరువు వద్దకు చేరుకుని కట్టమైసమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం చెరువు కట్ట వద్ద మహిళలందరూ కలిసి బతుకమ్మ ఆడుతూ పాటలు పాడుతూ ముత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కల్పనా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఏళ్ల తరబడి కూడుకుపోయిన చెరువులన్నీ పునరుద్ధరణ జరిగి ఎండాకాలంలో సైతం నీళ్లతో కళకళలాడుతున్నాయన్నారు. ఆధారపడిన మత్స్యకారులకు అనేక రకాలైన పథకాలతో ఆర్థిక స్వలంబన చేకూరిందన్నారు. గేట్ కారేపల్లి పెద్ద చెరువు పరిధిలో రెండు సంఘాలు ఉన్నాయని ఈ సంఘాలకు 2017–18 సంవత్సరాల నుంచి 2022–23 సంవత్సరాల వరకు 3.80 లక్షల సబ్సిడీపై చేప పిల్లలు, 2.90 లక్షల విలువైన చేప పిల్లలు, సాధించిన ఉత్పత్తి రెండు లక్షల పదహారువేల 827టన్నులు, వీటి ద్వారా 281.87



లక్షల ఆదాయం, 84 ద్విచక్రవాహనాలు ఇచ్చామని ఇదంతా తెలంగాణ ప్రభుత్వం సాధించిన ఘనతగా పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రత్యేక అధికారి నరేందర్, పంచాయతీ కార్యదర్శులు కృష్ణవేణి, అనురాధ, వెంకట సింధు, సైదా రెడ్డి, ప్రత్యేక అధికారి సొందు సాహెబ్, టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సాయిని తిరుపతయ్య, నాయకులు గుడిపూడి నరసయ్య, తాళ్లూరి అప్పారావు, కుసుమ నాగరాజు, హనుమకొండ నాగేష్, సామినేని తిరుపతిరావు, వరి కొల్లి వీరభద్రం, నూకల వెంకటేశ్వర్లు, భూక్య రమేష్, కందుల సామేల్ తదితరులు పాల్గొన్నారు

# సిపిఎం సానుభూతిపరులు సుంకర శ్రీహర్ష మృతి

**వైరాటౌన్, జూన్ 8(మనం న్యూస్) :** సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్ పెద్ద కుమారుడు పార్టీ సానుభూతిపరులు సుంకర శ్రీహర్ష(29) బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించారు. గురువారం వైరా మండలం కొష్టాల గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ ఛైర్మన్ లింగాల కమలరాజు, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, భుక్యా వీరభద్రం, బండి రమేష్, వై విక్రమ్, పొన్నం వెంకటేశ్వరరావు అమరజీవి సుంకర శ్రీహర్ష భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీరితోపాటు సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, బండారు రమేష్, పారుపల్లి ఝాన్సి, ఎస్.నవీన్ రెడ్డి, ఖమ్మం టు టౌన్, వైరా, కొణిజర్ల, ఎన్కూర్ మండల కార్యదర్శులు బొడపట్ల సుదర్శన్, తోట నాగేశ్వరరావు, చెరుకుపల్లి కుటుంబరావు, దొంతెబోయిన నాగేశ్వరరావు, కొప్పుల కృష్ణయ్య, షేక్.మీరా, వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మద్దెల ప్రసాదరావు, పొంగులేటి వర్గం రాష్ట్ర నాయకులు బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, పనితి సైదులు, దార్న రాజశేఖర్, మధు విద్యాసంస్థల ఛైర్మన్ మల్లెంపాటి వీరభద్రరావు, ఠాగూర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవి కుమార్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మధిర ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పాగి బాలస్వామి, విలేకరులు ఎస్.కె నాగుల్ మీరా, మేడా సూర్య ప్రసాద్, పులి కృష్ణార్జునరావు,



నవతెలంగాణ సిబ్బంది తాళ్లూరి నాగేశ్వరరావు, గుమ్మడి నర్సయ్య, సిపిఐ(ఎం) నాయకులు పారుపల్లి కృష్ణారావు, తూము సుధాకర్, బాజోజు రమణ, రెగళ్ల తిరుమలరావు, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహనరావు, మల్లెంపాటి రామారావు, మల్లెంపాటి ప్రసాదరావు, హరి వెంకటేశ్వరరావు, రాచబంటి భత్తిరన్న, పైడిపల్లి సాంబశివరావు, గొల్లపూడి ప్రకాశరావు, చింతనిప్పు చలపతిరావు, బోడపట్ల రవీందర్, గుమ్మా నరసింహారావు, బెజవాడ వీరభద్రరావు, బొంతు సమత, మాడపాటి మల్లికార్జునరావు, అనుమోలు రామారావు, పారుపల్లి శ్రీనాథ్, కురుగుంట్ల శ్రీనివాసరావు, యనమద్ది రామకృష్ణ, కొమ్మిన బాబురావు, మందడపు రామారావు, దేవబత్తిని నరసింహారావు, సంక్రాంతి పురుషోత్తం, సదానందం, వడ్లమూడి మధు, తోట కృష్ణవేణి, షేక్ నాగుల్ పాషా, మాడపాటి రామారావు, దేవుళ్ళ కృష్ణ, బత్తుల ప్రమీల, కొష్టాల సర్పంచ్ మంచాల జయరావు కుటుంబ సభ్యులు, బంధువుల స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన కోట రాంబాబు

**మధిర,జూన్8(మనం న్యూస్):** మధిర నియోజకవర్గంలోని పలు మండలాల్లో ప్రముఖ వైద్యులు పొంగిలేటి శ్రీనన్న అనుచరుడు డాక్టర్ కోటా రాంబాబు గురువారం విస్తృతంగా పర్యటించారు. దీనిలోని భాగంగా బోనకల్ మండలం చొప్పకట్లపాలెం గ్రామంలో బోయినపల్లి విశ్వనాథం కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శ్రీనన్న కానుకగా నూతన వస్త్రాలను బహూకరించారు. అదే గ్రామంలో బోయినపల్లి గంగరాజు కుమార్తెల నూతన వస్త్రాలంకరణ వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. దారెల్లి బాబు కుమార్తె వివాహ ప్రధాన వేడుకకు హాజరై నూతన వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం గంపలగూడెం మండలం వూటుకూరు గ్రామంలో కొంగల హనుమంత్ రావు కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామంలో కటారపు వెంకయ్య ఇటీవలే అకాల మరణం పొందగా వారి దశదిన కర్మకు హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మొలుగుమాడు గ్రామంలో వెల్లంకి ఓల్లెమ్మ అకాల మరణం పొందగా వారి మృతదేహానికి



నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఉమ్మినేని కృష్ణ, సర్పంచ్ మందడపు తిరుమలరావు, సర్పంచ్ సుబ్బారావు, సర్పంచ్ చిలకా వెంకటేశ్వర్లు, దారగాని నారాయణ, శేఖర్, పోలెబోయిన శ్రీకాంత్, బోయినపల్లి పకీరయ్య, గోపి, బొగ్గవరపు సోమయ్య, దారెల్లి వెంకటేశ్వర్లు, ధారెల్లి శ్వరాజ్యారావు, సోమా రవికాంత్, సీతారామయ్య, తమ్మిశెట్టి బాలకృష్ణ, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మత్స్య సంపదతో ఆర్థికంగా మత్స్యకారులు బలోపేతం



**మహబూబాబాద్, జూన్ 8(మనం ప్రతినిధి):** నాడు చెరువులో నీరు ఉంటేనే మత్స్య సంపద పొందేవారని నేడు కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎస్సారెస్పీ కాలువల ద్వారా ప్రతి చెరువును నీటితో నింపడం మత్స్యకారులను సొసైటీలుగా ఏర్పర్చి బలపరచడం ఈ ఘనత తమ తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందని రాష్ట్ర గిరిజన సంక్షేమం మహిళ శిశు సంక్షేమ శాఖ మాత్యులు సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని జడ్పీ చైర్మన్ ఆంగోత్ బిందు పార్లమెంటు సభ్యురాలు కవిత మహబూబాబాద్ ఇల్లందు శాసనసభ్యులు బానోతు శంకర్ నాయక్ , హరిప్రియ మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. అనంతరం సభను మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. నాడు వేసవికాలం వచ్చిందంటే చెరువుల ఎండి పోయావని నేడు మండుటెండలో కూడా మత్తడిపోస్తున్నాయన్నారు.సాగునీటి కొరత లేకుండా కాళేశ్వరం తెలంగాణకే తలమానికంగా నిలిచిందన్నారు. చెరువుల నిండా నీరు సమృద్ధిగా ఉండటంతో రైతులే కాకుండా మత్స్యకారులు కూడా చేపల ఉత్పత్తితో మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయన్నారు. చేప ఉత్పత్తి తోపాటు విక్రయాలను పెంచేందుకు నిరుపేద మత్స్యకారులకు వలలు వాహనాలు అందిస్తూ వారి జీవనోపాధికి తోడ్పాటు అందించడం జరుగుతున్నది అన్నారు.జిల్లాలో 11వేల మంది మత్స్యకారుల కుటుంబాలు ప్రత్యేకంగాను 35 వేల కుటుంబాలు పరోక్షంగాను చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నట్లు తెలియజేశారు వీరికి ప్రమాద బీమా పథకం ఐదు లక్షలు ఆర్థిక సాయం క్రింద అందజేస్తున్నామన్నారు ఇప్పటివరకు 19 మందికి 72 లక్షల రూపాయలు అందించడం జరిగిందన్నారు తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక 22 కోట్ల విలువగల 26 కోట్ల చేప పిల్లలను 82,895 టన్నుల ఉత్పత్తితో మత్స్యకారులకు 2566 కోట్ల ఆదాయం రావడం జరిగిందన్నారు.అదేవిధంగా ప్రచారం న్యాయంగా చేప సంబంధిత వంటకాలను తయారుచేసి విక్రయిస్తూ ఆదాయం గడించాలని మహిళలకు సహకారం అందజేస్తామన్నారు.గిరిజన సంక్షేమ శాఖ నుండి రిజర్వేషన్ అందిస్తామని సబ్సిడీ ఇచ్చి మత్స్యకారుల కుటుంబాలను మరింత బలోపేతం చేస్తామన్నారు.జడ్పీ చైర్మన్ ఆంగోత్ బిందు మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని చెరువులలో వేసవికాలంలో నీరు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదలకు అవకాశాలు కల్పిస్తామని ఆర్థికంగా బలోపేతం చేస్తామన్నారుపార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నదని అందులో భాగంగా గ్రామీణ మత్స్యకారుల అభివృద్ధికి గాను చేప విక్రయాలను పెంచి వారి జీవన ప్రగతి కి మార్గ నిర్దేశం చేస్తామన్నారు చేప వంటకాలను రుచి చూపించి విక్రయాలు పెరిగే విధంగా ప్రోత్సహిస్తామన్నారు.ఇల్లందు శాసన సభ్యురాలు హరిప్రియ మాట్లాడుతూ నేడు చెరువుల వద్ద పండుగ వాతావరణం నెలకొన్నది అంటే అది తెలంగాణ ప్రభుత్వం ఘనకార్యం గా పేర్కొన్నారు. చేపల కొరకు నాడు ఇతర రాష్ట్రాలపై ఆధారపడి ఉండేవారమని నేడు చెరువులు నిండుగా ఉండడంతో మత్స్యకారులు మత్స్య సంపదను విరివిగా పెంచడంతో చేపలు అందుబాటులోకి వచ్చాయన్నారు 81 లక్షలతో సొసైటీలను బలోపేతం చేశామని 30 కోట్లు లబ్ధి పొందారని 100% మత్స్యకారులు విజయవంతంగా ముందడుగు వేస్తున్నారన్నారు నీలి విప్లవం రాష్ట్రంలో ఆదాయ వనరుగా మిగిలిందని 76 వేల టన్నుల ఆదాయం సమకూరిందన్నారు మత్స్యకారుల కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి కృషి చేసిన రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు మత్స్యశాఖ ప్రగతికి అభివందనలు తెలిపారు.

మహబూబాబాద్ శాసనసభ్యులు బానోతు శంకర్ నాయక్ మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు ప్రతి చెరువులోనూ 10 నుండి 15 కిలోల చేపలు ఉన్నాయంటే అది మత్స్యకారుల ప్రతిభ అని తెలియజేశారు కాకతీయుల కాలం నాటి చెరువులను తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంతో పటిష్టపరిచిందని మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపింది అన్నారు మత్స్యకారులకు తన వంతు సహకారం అందించేలా కమ్యూనిటీ హాల్స్ మంజూరు చేస్తానన్నారు.అంతకుముందు మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫుడ్ ఫెస్ట్ స్టాల్స్ లను ముందుగా మంత్రి సందర్శించి పరిశీలించారు.వివిధ రకాల చేప పిల్లల ప్రదర్శనశాల లను తిలకించారుతెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ఆలపించిన గేయాలు ప్రేక్షకులను అలరింపజేశాయిఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమాదేవి జిల్లా పంచాయతీ అధికారి నర్మద సహకార శాఖ అధికారి ఖుర్షీద్, మార్కెటింగ్ శాఖ అధికారి వెంకట్ రెడ్డి మత్స్య శాఖ అధికారి నాగమణి మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షులు గొడుగు శ్రీనివాస్ సహదేవ్ కౌన్సిలర్ వెంకన్న మార్నేని వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

# మనం మహబూబాబాద్

## చెరువులను నింపిన ఘనత సీఎం కేసీఆర్ దే
### గార్ల సర్పంచ్ బన్సీలాల్



**గార్ల, జూన్ 8 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో చెరువులను నీటితో నింపిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందని గార్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అజ్మీర బన్సిలాల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా గురువారం చెరువుల పండుగను సర్పంచ్ బన్సిలాల్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో గంగమ్మ తల్లికి పూజలు చేస్తూ, బతుకమ్మలని చెరువుల్లో వదులుతూ, కట్టమైసమ్మల దగ్గర పూజలు నిర్వహిస్తూ, ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ విందు, వినోదాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత పాలనలో నెర్రెలు పారి గోసరిల్లిన చెరువులను మన రాష్ట్ర ప్రభుత్వం నీటితో నింపి, ఆ నీటిలో ఉచితంగా చేపలు వేసి, జాలర్లకు చేపలు పట్టుకునే అవకాశం కల్పించడమే కాక, ఆదాయ మార్గాన్ని చూపించిందని అన్నారు. చెరువులు ఒకప్పుడు ఏ విధంగా ప్రజలకు ఉపయోగపడ్డాయో, తిరిగి వాటిని మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టి బాగు చేసి అదే తరహాలో ప్రజలకు ఉపయోగంలోకి సీఎం కెసిఆర్ తెచ్చారని, ఇవాళ చెరువులు ప్రజలకు బతుకుదెరువుగా మారాయని సర్పంచ్ తెలిపారు. ఇదంతా సీఎం కేసీఆర్ కృషి వల్ల జరుగిందని సర్పంచ్ అన్నారు. తెలంగాణను అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిపిన సీఎం కేసీఆర్ కి అండగా నిలవాలని జాలర్లను, రైతులను ప్రజలను సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మూడు శివాజీ చౌహాన్, ఎంపిటీసి శీలంశెట్టి రమేష్, కో ఆప్షన్ సభ్యులు ఖదీర్ బాబా, వార్డు సభ్యులు తోడేటి శ్రీనివాస్, ఏఒ రామారావు, ఈఒ కుమారస్వామి ప్రజలు పాల్గొన్నారు.



## ఘనంగా ఊరూరా చెరువుల పండగ

**కేసముద్రం, జూన్ 8(మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సాహాల సందర్భంగా తాళ్లపూసపల్లి గ్రామంలో సర్పంచ్ రావుల విజితా రవిచందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. గ్రామంలోని మహిళలు తెలంగాణ సాంప్రదాయకమైన బతుకమ్మలను, బోనాలను ఎత్తుకొని ఊరు మొత్తం కోలాటాలతో నృత్యాలు చేసుకుంటూ, కురుమ గొల్లల డప్పు వాయిద్యాలతో, డిజె సప్పులతో గ్రామంలోని మహిళలు చిన్నపిల్లలు యువకులు పార్టీలకు అతీతంగా గ్రామ ప్రజలు తరలివచ్చి ఊరురా చెరువుల పండుగను ఘనంగా జరుపుకోవడం జరిగింది. గ్రామ పెద్దలు రవిచందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని చెరువులు ఎండాకాలంలో కూడా మత్తడిపోస్తున్నాయి దానికి ముఖ్య కారణం మన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో రాష్ట్రంలోని చెరువులు నిండుకుండ లాగా కనబడుతున్నాయి మిషన్ కాకతీయ తో చెరువులను పూడిక తీసి భూగర్భ జలాలు పెరగడంతో పాటు రాష్ట్రంలోని రెండు పంటలు పండించుకోవడం చేపల దిగుమతి పెరగడం చాలా సంతోషదాయకమని తెలిపారు. వైస్ ఎంపీపీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి చేస్తున్న పనులకు కరువు నేలలు కూడా పచ్చగా కనబడుతున్నాయి అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు అందనంత దూరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలియజేశారు.ఈ యొక్క కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గౌండ్ల యాదగిరి, మాజీ సర్పంచ్ పోత్కం సుధాకర్,వార్డు మెంబర్స్,గొర్రె వెంకన్న,పెటేరు సింహాద్రి, కాల్ల లక్ష్మయ్య, కండె బిక్షపతి, మైదం రవి,బొల్లు కుమార్, దుస్స సుధాకర్ , వల్లాల శ్రావణ్, డ్వాక్రా గ్రూప్ మహిళలు, అంగన్వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చినారు.

# వడ్డెకొత్తపల్లిలో బతుకమ్మ సంబరాలు

### మైసమ్మకు బోనం చెల్లింపు
### బతుకమ్మలతో ఆడి పాడిన మహిళా మణులు
### అంగరంగ వైభవంగా చెరువు కట్ట పండగ





**పెద్దవంగర, జూన్ 8, (మనం న్యూస్) :** రాష్ట్రంలో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా వడ్డెకొత్తపల్లి గ్రామంలో చెరువు కట్ట పండుగ సంబరాలు జరుపుకున్నారు, గురువారం రోజున మండలంలోని వడ్డేకొత్తపల్లి గ్రామంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ కార్యదర్శి మురళి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గ్రామ చెరువు కట్టలపై ఉన్నటువంటి మైసమ్మకు గ్రామంలో ఉన్న ఆడపడుచులందరూ బోనాలతో మైసమ్మ చెంతకు చేరి బోనం చెల్లించారు, అనంతరం బతుకమ్మలతో ఆడపడుచులు అంగరంగ వైభవంగా ఒక పండుగ వాతావరణాన్ని నెలకొల్పి తెలంగాణ సాంస్కృతి ఉట్టిపడేలా ఆడి పాడారు, అనంతరం గ్రామ ప్రజలందరికీ భోజనాలను ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ ఖుర్షీద్, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మార్వో రమేష్ బాబు, ఎస్సై పిల్లల రాజు, ఐసిడిఎస్ కవిత, వార్డు సభ్యులు రామరాజు, జనార్ధన్, రేణుక, సంధ్య ,ఎల్లయ్య,సిఏలు కామరాతి, నిర్మల, అంగన్వాడి టీచర్లు సుకన్య, అరుణ, వెంకటలక్ష్మి, రజిత మహిళా సంఘం సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదివాసీల చీకట్లో తొలగించిన ఎస్ఐ రామారావు

**– 15 ఏళ్ల తర్వాత సోలార్ లైట్లు ఏర్పాటు**
**– ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు**







**కారేపల్లి రూరల్, జూన్ 8 (మనం న్యూస్) :** ఉదయం సూర్యుడి వెలుగులో తమ జీవితాన్ని ఆనందంగా గడిపిన ఆదివాసీలు రాత్రివేళ మాత్రం వారు సుమారు 15 సంవత్సరాలుగా చీకటితో సహవాసం చేస్తున్నారు. ఈ విషయం కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు దృష్టికి చేరింది. వృత్తిరీత్యా కఠినతరమైన ఖాకి చొక్కా వేసిన దాని వెనక మనసు మాత్రం కష్టాలను చూస్తే కరిగిపోతుంది... ఇక్కడ అదే జరిగింది. మండల పరిధిలోని ఎర్రబోడు గ్రామ సమీపంలోని ఊటవాగు ఆదివాసి గ్రామంలో సుమారు 26 గుడిసెలలో ఆదివాసి గుత్తి కోయలు నివసిస్తున్నారు. భౌగోళికంగా ఈ ప్రాంతం కామేపల్లి మండలానికి చెందినా వారి ఉపాధి, నిత్య అవసరాలకు సింగరేణి మండలంలోని ఎర్రబోడు గ్రామం నుండి ప్రయాణం సాగించేవారు. ఇటీవల కార్యక్రమంలో గ్రామంలోని ఆదివాసీలకు రగ్గులు పంపిణీ చేసి ఆదివాసీ గూడెం భౌగోళిక పరిస్థితులను పరిశీలించి అక్కడి ప్రజలను ప్రధానంగా వేధిస్తున్న సమస్య అయిన చీకటిని తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అనుకున్నది తడవుగా సింగరేణి జనరల్ మేనేజర్ రాజు దృష్టికి తీసుకుని వెళ్ళగా వెంటనే స్పందించిన జనరల్ మేనేజర్ సంస్థ సామాజిక బాధ్యత కింద 80 వేల రూపాయలు వెచ్చించి మూడు సోలార్ లైట్లు ఏర్పాటు చేయించారు. దీంతో సుమారు 15 సంవత్సరాల తమ చీకట్లు ప్రారదోలి వెలుగులు నింపారని గ్రామంలోని 150 మంది ఆదివాసి గుత్తి కోయ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ఎస్సై రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణే కాకుండా సమాజంలో ఇటువంటి అనేక సమస్యల పైన స్పందిస్తున్న ఎస్సై రామారావును మండల ప్రజలు అభినందిస్తున్నారు.

# తొడిదల గూడెంలో వెల్లి విరిసిన దశాబ్ది ఉత్సవాలు

**– చెరువు పండుగకు కదిలిన ఊరు**
**--విద్యుత్ దీపాలతో చెరువుకట్ట అలంకరణ**



**కారేపల్లి రూరల్, జూన్ 8 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు తెలంగాణ రాష్ట్ర ఘనతను, ఖ్యాతిని ఘనంగా చాటుతున్నాయని సర్పంచ్ బానోత్ కుమార్, ఎంపీపీ మాలోత్ శకుంతల కిషోర్, ఎంపీటీసీ, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమా శంకర్ లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం మండల పరిధిలోని తొడిదలగూడం గ్రామం లోని చుట్టికుంట చెరువు వద్ద అంగరంగ వైభవంగా ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని మహిళలంతా ఒకచోటికి చేరి బోనాలు తలపై పెట్టుకుని కట్టమైసమ్మ వద్దకు పోతురాజు నృత్యాలతో తరలివెళ్లి బోనాలు సమర్పించారు. చెరువు కట్ట సమీపంలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆడారు. ఎంపీపీ మాలోత్ శకుంతల కిషోర్ మహిళలతో ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడక ముందు గ్రామం ఊరి చివరన ఉన్న చెరువులో వేసవికాలం వచ్చిందంటే పిల్లలు, యువకులు క్రీడామైదానాలుగా చేసుకుని ఆటలాడుతుంటే, చెరువుల పైన ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారులు రైతులు, అనేక మంది ప్రజలకు చెరువులో నీళ్లు లేక ఎండిపోయిన చెరువులను కళ్ళ వెంట కన్నీళ్లు కారేవన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటగా కెసిఆర్ రైతుల కష్టాలను తన కష్టాలుగా భావించి చెరువుల పునరుద్ధరణ పేరుతో చేపట్టిన మిషన్ కాకతీయ పథకంలో చెరువులను పూడిక తీసి ఆ పూడిక మట్టిని రైతుల తమ పొలాల్లో వినియోగించుకునే విధంగా పథకం ఏర్పాటు చేయడంతో ఒకవైపు చెరువులో ఏళ్ల తరబడి పేరుకుపోయిన పూడికకు మోక్షం కలగడం, చెరువు మట్టితో రైతుల భూములను సారవంతం చేయడం జరిగిందన్నారు. మత్స్యకారులకు ప్రత్యేకమైన నిధులు ఏర్పాటు చేసి సబ్సిడీపై చేప పిల్లలు పంపిణీ చేసి, వాహనాలు అందజేసి వారి ఆర్థిక స్థితి మెరుగుపడేందుకు కేసిఆర్ కారణమయ్యారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతూ పథకాలు పారదర్శకంగా అమలు చేసుకుంటూ తెలంగాణ రాష్ట్రం ఘనంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుకుంటుందన్నారు. ఈ పథకాలు ఎప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉండాలంటే రాబోయే ఎన్నికలలో కెసిఆర్ ను ఆశీర్వదించాలన్నారు. వైరా నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాములు నాయక్ ప్రత్యేక చొరవతో ఇటీవల కాలంలో తొడిదల గూడెం గ్రామంలో సుమారు 30 లక్షల రూపాయలకు పైగా అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ తూమాటి శ్రీనివాసరావు, ఐబి డి ఈ వెంకట్ నాయక్, పంచాయతీ కార్యదర్శి బానోత ఉమా, నాగేంద్రబాబు, ఎస్సై పుష్పాల రామారావు, ఐకెపి సిసి పగడాల పుష్ప, సొసైటీ డైరెక్టర్లు మర్సకట్ల రోశయ్య, డేగల ఉపేందర్, నాయకులు హరు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి



**ఇల్లందు జూన్ 08 (మనం న్యూస్) :** ఇల్లందుశివారు ప్రాంతమైన లలితాపురం గ్రామం నుండి ఇల్లందు వైద్యం నిమిత్తం ద్విచక్ర వాహనంపై బయలుదేరిన భార్యాభర్తతలీరువురు యాక్సిడెంట్ గుర్రై ప్రాణాలు వదిలారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారని పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం 10:30 గంటల సమయంలో లలితాపురం గ్రామం నుండి నడిగొండ సుబ్బారావు వయసు 55 (తండ్రి సీతారాములు) సుబ్బారావు సతీమణి లలిత (వయసు 47) అను వారిరువు వారి ద్విచక్ర వాహనంపై ఇల్లందులో వైద్యం చేయించుకోవడం కోసం బయలుదేరారని గౌతమ్ బుద్ధ ఐటిఐ ప్రాంగణంలో చేరుకోగానే ఇల్లందు నుండి ఖమ్మం వైపు వెళ్తున్న కేఏ00ఏజి 4187 అనే కంటైనర్ డ్రైవర్ రాజ్ కుమార్ నిర్లక్ష్య ధోరణిలో అమిత వేగంతో వాహనం నడుపుతూ ద్విచక్ర : అజాగ్రత్త అతివేగం ద్విచక్ర వాహనం .డి. కొట్టడంతో సంఘటనా స్థలంలోనే భర్త సుబ్బారావు మృతి. చెందాడని వైద్య సేవలు కొనసాగుతున్నన తరుణంలో భార్య లలిత మృతి. చెందిందని తెలిపారు. ఇల్లందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారని పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడించనున్నామని పోలీసులు తెలిపారు .

# ఘనంగా తెలంగాణ చెరువుల పండగ సంబరాలు







**మధిర,జూన్8(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువు కట్ట సంబరాలను మధిర మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ఎమ్మెల్సీ తాతా మధు పాల్గొన్నారు. చెరువు కట్ట సంబరాల్లో మధిర మున్సిపాలిటీ చైర్పర్సన్ మొండితోక లతా జయకర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుండి బయలుదేరిన తెలంగాణ సాంప్రదాయ భారీ బతుకమ్మలతో మహిళా మణులు చెరువు కట్ట వద్దకు చేరుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో లింగాల కమల్ రాజు, తాత మధు, బొమ్మెర రామ్మూర్తి మాట్లాడుతూ దశాబ్ద కాలంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ కృషితో సీఎం కేసీఆర్ కి ముందు సీఎం కేసీఆర్ తర్వాత అనే విధంగా అభివృద్ధి పథంలో తెలంగాణ ఉంది అని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిలో భాగంగా చెరువు అభివృద్ధి రైతులకు ఎంతో మేలును చేకూర్చిందని, మిషన్ కాకతీయ ద్వారా చెరువులో పూడికలు తీయడంతో నీరు నిలవ ఉండడంతో రైతుల పంటలు సమృద్ధిగా పండేయని దీంతో రైతుల ఆర్థికంగా ఎంతో అభివృద్ధి పొందారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లుతున్నారని రాబోయే కాలంలో కూడా సీఎం కేసీఆర్ మళ్ళీ గెలిపించుకొని తెలంగాణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు సహకరించాలని ఈ సందర్భంగా వారి కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్న ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థుల మీద ప్రయోగాలు వద్దు

**ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి భయ్యా అభిమన్యు**




**ఇల్లందు జూన్ 08 (మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గిరిజన ప్రాంతంలో గిరిజన విద్యార్థులని చదువులకు దూరం చేసేందుకు గిరిజన సంక్షేమ అధికారులు కుట్రలు పన్నుతున్నట్టుగా ఉందని అందుకే విద్యాహక్కు చట్టాన్ని సైతం తుంగలో తొక్కుతున్నట్టుగా వారి చర్యలు ఉన్నాయని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి బయ్యా అభిమన్యు నిందించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో అనేక ప్రాంతంలో ఎంతోమంది మారుమూల ప్రాంతాల్లో ఉన్నటువంటి విద్యార్థులకు విద్యాసంస్థలని అందుబాటులో ఉంచుతూ అనేక ఆశ్రమ పాఠశాలను నెలకొల్పారని తెలిపారు. ఒక్కో ఆశ్రమ పాఠశాలలో అబ్బాయిలు 50 మంది, అమ్మాయిలు అయితే 45 మంది ఒక్కో సెక్షన్ కి చదువుకోవాలని చెప్పి కుదింపు పెట్టి అక్కడ 45 కంటే ఎక్కువ మంది ఉన్నటువంటి దగ్గర ఆ బడిలో ఒక సెక్షనే ఉంటే ఆ మిగిలినటువంటి విద్యార్థులని వేరే పాఠశాలలకు షిఫ్ట్ చేసే చర్యలకు పూనుకుటున్నారని తెలిపారు. ఇది సరైన చర్య కాదన్నారు. గిరిజన విద్యార్థుల మీద ప్రయోగాలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ పట్టణ నాయకులు ప్రవీణ్ వెంకటేష్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు..

# చెరువు సంబరాలను పరిశీలించిన జెసి



**నేలకొండపల్లి, జూన్ 8(మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జరగనున్న చెరువు సంబరాలను జిల్లా జాయింట్ కలెక్టర్ మధుసూదన్ రావు గురువారం మండలంలోని అ నా సా గ ౦ ౦, ముజ్జుగూడెం చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువుల సంబరాల ఏర్పాట్లను తహసిల్దార్ ధారా ప్రసాద్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు ఎటువంటి లోటు లేకుండా ఘనంగా జరిగేలా ఏర్పాటు చేయాలన్నారు. బతుకమ్మలు ఆడిస్తున్నారా? బోనాలు పెడుతున్నారా? అంటూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంబరాలు మిన్నంటేలా ఉండాలన్నారు. ఆయన వెంట తహసిల్దార్ ధార ప్రసాద్, సర్పంచ్ పాపినేని కరుణశ్రీ, ఐకెపి ఎపిఎం అశోకరాణి, రైతులు పాపినేని వెంకటనారాయణ, ముజ్జిగూడెం పంచాయతీ కార్యదర్శి రవికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చెరువులను నింపిన ఘనత కేసీఆర్‌దే..

## రూ.50 లక్షల అభివృద్ధి పనులకు రేగా శంకుస్థాపన..

**కరకగూడెం జూన్ 8(మనం న్యూస్):**తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల వేడుకల్లో ఊరూర చెరువుల పండగ లో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పాల్గొని తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర కరకగూడెం మండలం లోని సమత్ భట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తన స్వగ్రామమైన కుర్నవల్లి గ్రామంలో ఊరురా చెరువుల పండగల కార్యక్రమంలో రేగా కాంతారావు పాల్గొన్నారు. తొలిత శ్రీ లక్ష్మీదేవి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు, తన నివాసం నుండి భారీ ఎత్తున తన కుటుంబ సభ్యులు స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ బోనాలతో ఎత్తుకొని చెరువు దగ్గరికి వెళ్లారు. గంగమ్మ తల్లికి పూజలు చేసి తనకు ఘన స్వాగతం పలికిన బతుకమ్మలను చెరువులో వదిలారు. బాల్యంలో తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం రేగా.కాంతారావు మాట్లాడుతూ గతంలో నిర్లక్ష్యానికి గురైన చెరువులన్నిటిని సీఎం కేసీఆర్ మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధించి పూర్వ వైభవం తెచ్చారని చెప్పారు. చెరువులలో చేపలు వేయడంతో అనేకమందికి ఉపాధి లభిస్తున్నదన్నారు. ప్రజలకు చెరువులే అదేరువు అని ఈవిషయాన్ని గుర్తించి మన



స్థానిక అవసరాలను తగ్గట్టుగా అనేక పథకాలు రూపొందించి సబ్బండ వర్గాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రేగా కాళికా, రేగా సతీమణి, సుధారాణి అధికారులు, ప్రజాప్రతినిధులు, బిఅర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రూరల్ విరిసిన దశాబ్ది ఉత్సవాలు

**-- చెరువు పండుగకు కదిలిన ఊరు**

**--విద్యుత్ దీపాలతో చెరువుకట్ట అలంకరణ**



**మనం న్యూస్ జూన్ 8 (మనం న్యూస్) ;**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు తెలంగాణ రాష్ట్ర ఘనతను ఘనంగా నిర్వహించారు చెరువు గట్టుపై కట్ట మైసమ్మ తల్లికి బోనమెత్తిన ఎంపీపీ బెల్లం ఉమా దశాబ్దాల పండుగ కళ నెరవేరింది. బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలోని చుట్టికుంట చెరువు వద్ద అంగరంగ వైభవంగా ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని మహిళలంతా ఒకచోటికి చేరి బోనాలు తలపై పెట్టుకుని కట్టమైసమ్మ వద్దకు పోతురాజు నృత్యాలతో తరలివెళ్లి బోనాలు సమర్పించారు. చెరువు కట్ట సమీపంలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆడారు. ఎంపీపీ మహిళలతో ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడక ముందు గ్రామం ఊరి చివరన ఉన్న చెరువులో వేసవికాలం వచ్చిందంటే పిల్లలు, యువకులు క్రీడామైదానాలుగా చేసుకుని ఆటలాడుతుంటే, చెరువుల పైన ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారులు రైతులు, అనేక మంది ప్రజలకు చెరువులో నీళ్లు లేక ఎండిపోయిన చెరువులను కళ్ళ వెంట కన్నీళ్లు కారేవన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటగా కెసిఆర్ రైతుల కష్టాలను తన కష్టాలుగా భావించి చెరువుల పునరుద్ధరణ పేరుతో చేపట్టిన మిషన్ కాకతీయ పథకంలో చెరువులను పూడిక తీసి ఆ పూడిక మట్టిని రైతుల తమ పొలాల్లో వినియోగించుకునే విధంగా పథకం ఏర్పాటు చేయడంతో ఒకవైపు చెరువులో ఏళ్ల తరబడి పేరుకుపోయిన పూడికకు మోక్షం కలగడం, చెరువు మట్టితో రైతుల భూములను సారవంతం చేయడం జరిగిందన్నారు. మత్స్యకారులకు ప్రత్యేకమైన నిధులు ఏర్పాటు చేసి సబ్సిడీపై చేప పిల్లలు పంపిణీ చేసి, వాహనాలు అందజేసి వారి ఆర్థిక స్థితి మెరుగుపడేందుకు కేసిఆర్ కారణమయ్యారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతూ పథకాలు పారదర్శకంగా అమలు చేసుకుంటూ తెలంగాణ రాష్ట్రం ఘనంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుకుంటుందన్నారు. ఈ పథకాలు ఎప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉండాలంటే రాబోయే ఎన్నికలలో కెసిఆర్ ను ఆశీర్వదించాలన్నారు. పాలేరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఇటీవల కాలంలో ఖమ్మం రూరల్ గ్రామంలో అభివృద్ధి పనులు చేసినట్టు అభివృద్ధి తోడుగా నిలిచారు ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ సుమ జడ్పిటిసి వరప్రసాద్ సూడా డైరెక్టర్ గూడ సంజీవరెడ్డి సర్పంచ్ వేమూరి విజయలక్ష్మి మహిళలు పాల్గొన్నారు.

# ములకలపల్లి గ్రామంలోపులు పండుగ

**డోర్నకల్ ,జూన్ 8 (మనం న్యూస్):** డోర్నకల్ మండలంలోని ములకలపల్లి గ్రామంలో గురువారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ తయారు చేసి ఊరంతా తిప్పుతూ గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ రాంప్రసాద్ ఉపసర్పంచ్ శేషయ్య రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు మధుసూదన్ రావు గ్రామ యువతీ యువకులు ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్స్ ఏఎన్ఎం రాఘవమ్మ కార్యదర్శి శశిధర్ రెడ్డి యేసయ్య కోటేశ్వరరావు టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు లాలయ్య వార్డు మెంబర్ శోభన్ బాబు శ్రీనివాసరావు



తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు అనంతరం భోజన కార్యక్రమం పాల్గొని డిజె పాటలపై స్టెప్పులు తో ఈ కార్యక్రమాన్ని హోరెత్తించారు



# బిజెపికి పుట్టగతులుండవు

**– ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా గర్జన**

**– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 8 (మనంప్రతినిధి):** రాష్ట్రంలో కానీ జిల్లాలో గాని బిజెపికి పుట్టగతులు ఉండవని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. గురువారం సిపిఐ పార్టీ నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బిజెపికి పుట్టగతులు ఉండవని కూనంనేని వ్యాఖ్యానించారు. ఖమ్మంలో బహిరంగ సభ పెట్టి తనకేదో బలం ఉందని నిరూపించుకోవడానికి బిజెపి ప్రయత్నం చేస్తుందని, కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బిజెపి పప్పులు ఉడకమని ఆయన అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండు విఫలమవుతున్నాయని సాంబశివరావు వ్యాఖ్యానించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ కంపెనీలను ప్రైవేటు వ్యక్తులకు కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తుందని, దేశంలో మతతత్వ పోకడలకు ఆజ్యం పోస్తుందని, దేశ సమగ్రతకు, సమైక్యతకు ముప్పు వాటిల్లే విధంగా, బిజెపి పోకడలు ఉన్నాయని ఘాటుగా విమర్శించారు. సిపిఐ బిజెపి హటావో నినాదంతో ఇప్పటికే వేలాది కార్యక్రమాలు నిర్వహించి లక్షలాదిమందికి బిజెపి హటావో నినాదాన్ని చేర వేసిందని కూనంనేని తెలిపారు.ఇక రాష్ట్ర ప్రభుత్వం విషయానికి వస్తే రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికీ ఇండ్ల సమస్య రేషన్ కార్డుల సమస్య పోడు పట్టాల సమస్య ఇంకా ఇతరత్రా సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోలేదని కూనంనేని స్పష్టం చేశారు. కమ్యూనిస్టులు నిత్యం ప్రజలకు దగ్గరగా ఉంటారని ప్రజా సమస్యల పరిష్కారం కోసమే కమ్యూనిస్టులు ఉద్యమాలు చేపడుతారని, త్వరలో జరగబోయే ప్రజాగర్జన సభకు ప్రజలు హృదయపూర్వకంగా హాజరవుతారని కూనంనేని తెలిపారు. కొత్తగూడెం పట్టణంలో సుమారు 30 సంవత్సరాల క్రితం లక్షలాది మందితో బహిరంగ సభలు నిర్వహించామని, సుదీర్ఘకాలం తర్వాత లక్ష మందితో సిపిఐ పార్టీ కొత్తగూడెంలో, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బహిరంగ సభ నిర్వహించబోతోందని ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా పార్టీ కార్యదర్శి సాబీర్ పాషా, బందెల నరసయ్య, గుత్తుల సత్యనారాయణ, వై శ్రీనివాసరెడ్డి, కంచర్ల జమలయ్య తదితరులు పాల్గొన్నారు.



# రాముతండాలో ఘనంగా చెరువుల పండుగ

**డోర్నకల్, జూన్ 8 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా గురువారం చెరువుల పండుగను సర్పంచ్ నునావత్ బద్రు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ తల్లికి, కట్ట మైసమ్మ దగ్గర పూజలు నిర్వహించారు. అనంతరం రాముతండా గ్రామ సర్పంచ్ బద్రు నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసిందని ప్రతి గ్రామంలో చెరువులను ఏర్పాటు చేసి భూగర్భ జలాలు పెరిగే విధంగా చేశారని రైతులకు నీటి సమస్య రాకుండా చేశారని,గతంలో ఏ ప్రభుత్వం వచ్చినా రైతులను పట్టించుకునే నాధుడే లేరని. గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతులకు రైతుబంధు, రైతురుణమాఫీ, రైతు బీమా, అందించిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని.ఈ కార్యక్రమం ఒక పండగ వాతావరణం నెలకొల్పిందని ఈ సందర్భంగా రైతులకు సర్పంచ్ బద్రు నాయక్ తెలియజేశారు. ఈ చెరువుల పండుగను మండుట ఎండలను సైతం లెక్కచేయకుండా భారీ సంఖ్యలో ప్రజలు డీ.జే.పాటలతో మహిళలు,కార్యకర్తలు, ఆట, పాటలతో సుమారు 600 పైచిలుకు ప్రజలు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు లూనావత్ శ్రీనివాస్ నాయక్,పార్టీ ఉపాధ్యక్షుడు ఎస్కే బాజీ, ఎం.పి.టి.సి. శారదా రెడ్డి, కార్యదర్శి నవీన్ కుమార్, విద్యా కమిటీ చైర్మన్ గుగులోతు రాంబాబు, వీఆర్ఏ దివ్య, ఏ.ఎన్.ఎం. రమాదేవి, కరోబారి నునావత్ రాంబాబు, ఆశా వర్కర్ జ్యోతి ,సుశీల, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు